పెట్టుబడిదారీ విధానం ఒక ప్రేతాత్మ కథ

అరుంధతీ రాయ్

PETTUBADIDARI VIDHANAM: OKA PRETATMA KATHA
Translation of Capitalism: A Ghost Story
by Arundhati Roy

Photos : Sanjay Ravath, Tribuvan Tiwari, Sandeepan Chattarjee, Ryuters.

Translated by : K. Suresh

© Arundhati Roy

Cover design : Ramanajeevi

₹ 25/-

Published by : MALUPU BOOKS, Hyderabad.
http://malupu.wordpress.com, email: malupuhyd@gmail.com

For copies : 2-1-1/5, Nallakunta, Hyderabad - 500 044

Published : June, 2012

www.vaaradhionline.c

ప్రచురణ సంఖ్య : 5

ప్రచురణ కాలం : జూన్, 2012

పెట్టుబడిదారి విధానం : ఒక ప్రేతాత్మ కథ

మూలం : క్యాపిటలిజం : ఎ గోస్ట్ స్టోరి - అరుంధతి రాయ్

అనువాదం : కె. సురేష్

కవర్ డిజైన్ : రమణజీవి

₹ 25/-

ప్రచురణ : మ లు పు బు క్స్, హైదరాబాద్

ప్రతులకు : 2-1-1/5, నల్లకుంట, హైదరాబాద్ - 500 044.

ముద్రణ : చరిత ఇంప్రెషన్స్, హైదరాబాద్. ఫోన్ : 27678411

ఆత్మావలోకనం

మార్క్సిజం పెట్టుబడిదారీ విధానాన్ని మట్టికాళ్ల మహారాక్షసి అంటుంది. ఆ మహారాక్షసి ఉక్కువేళ్లు మట్టిపొరలు చీల్చుకొని భూగర్భ జలాల్లోకి, వనర్లలోకి పాతాళలోకమంతా విస్తరించి ఇవ్వాళ సామ్రాజ్యవాద ఆక్టోపస్ అయి భూనభోంతరాళాలను ఆక్రమించుకున్నవి. అయినా అది పరాన్నభుక్కు గనుక, పెట్టుబడి తానుగా వృద్ధికాగలిగేది కాదు గనుక, శ్రమశక్తి, వనర్లు అనే రెండు కాళ్లు లేకుండా అది నడవలేదు గనుక, అసలు నిలబడలేదు గనుక, అది ఎంత మహారాక్షసి అయినా దాని కాళ్లు రక్త మాంసాలు, ప్రాణం లేని మట్టివని – దాని పునాదుల్ని కూల్చడం సులభమని మార్క్స్ కార్మికవర్గం శక్తి మీద అపారమైన విశ్వాసంతో చెప్పాడు. లెనిన్ నాయకత్వంలోను, మావో నాయకత్వంలోను కార్మిక వర్గ, రైతాంగ విప్లవాలు ఆ శాస్త్రీయ స్వప్నాన్ని రుజువు చేసాయి.

మావో 'సామ్రాజ్యవాదం మనం ఏమరుపాటున ఉండదగని పులి' అని చెప్తూనే 'అంతమాత్రాన భయపడవలసింది ఏమీ లేదు అది కాగితపు పులి' అని తేల్చేసాడు. మావో కాలానికి పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్యవాదంగా సమస్త భూగోళాన్ని తన మార్కెటు దాహానికి గురి చేసింది. అది ఎంత సామ్రాజ్యవాద యుగమైందో అంత విప్లవాల యుగం కూడ అయింది. వలసలు విముక్తమయి ఐదింట రెండు వంతుల భూగోళం సామ్యవాద ఫలాలను చవి చూసింది.

సాహిత్యంలో శ్రీ శ్రీ సామ్రాజ్యవాదాన్ని మట్టి పులి అన్నాడు. దూది పులి అన్నాడు. కాటన్ మార్కెట్, షేర్ మార్కెట్ మన జీవితాలను నియంత్రించిన కాలంలో. కాని ఈ దూది పులిని నీటిలో ముంచితే ఏమీ మిగలదని తేల్చేసాడు. గూగీ వాథియాంగో దీనిని డెవిల్ ఆన్ ది క్రాస్ (సిలువపై రాక్షసి) అని ఆఫ్రికా ఖండానికి ఒక చేత ఖడ్గం, మరొక చేత బైబిలూ పట్టుకొని వచ్చిన సామ్రాజ్యవాద అనుభవంతో చెప్పాడు. ఆఫ్రికా ఖండంలో జాతి విముక్తి పోరాటాలు, ఆ వలసలనుండి విముక్తం చేసాయి గానీ ఈ పుస్తకంలో అరుంధతీ రాయ్ చెప్పినట్లుగా నల్లజాతి విముక్తి ప్రదాతలనుకున్న కెన్యాట్టా మొదలు నెల్సెన్ మండేలా వరకు 'వాషింగ్టన్ ఏకాభిప్రాయానికే' తల ఒగ్గారు.

ఇప్పుడు తాజాగా మరొక ప్రముఖ రచయిత అరుంధతీ రాయ్ పెట్టుబడిదారీ విధానాన్ని ప్రేతాత్మ (క్యాపిటలిస్ట్ ఘోస్ట్) అంటున్నది.

పెట్టుబడిదారీ విధానం, దాని అత్యున్నత రూపమైన సామ్రాజ్యవాదం ఇవ్వాళ ఎంత పెనుభూతంగా విశ్వమంతా విస్తరించి భయవిహ్వలతకు గురి చేస్తున్నా మార్క్స్ మొదలు అరుంధతీ రాయ్ వరకు పోరాడే శక్తులకు ఇస్తున్న విశ్వాసం ఏమిటంటే వాటిల్లో మానవసారం లేదు. ఆత్మలేదు, అవి ప్రేతాత్మలే. ప్రేతాత్మ ఆత్మకు పర్యాయపదం కాజాలదు. మానవసారానికి పెట్టుబడి ప్రత్యామ్నాయం కాజాలదు.

ముంబై అల్బామౌంట్ రోడ్డులో ముఖేష్ అంబానీ 27 అంతస్తుల అంటిల్లా భవనంలోని ధగధగలాడే దీపకాంతులు ప్రకృతి సిద్ధంగా ఏర్పడే రాత్రిందినాలను రద్దు చేయలేవు. అవి తాత్కాలికంగా ఆ ప్రాంత ప్రజలకు రాత్రిళ్లు లేకుండా చేయగలవు. అంటే శ్రమేగాని విశ్రాంతి లేకుండా చేయగలవు. కాని అది ఎల్లకాలం ఉండబోయే సత్యం కాదు. అది ఒక అభాస మాత్రమే.

ప్రేతాత్మ ఎప్పుడూ ఆత్మ చుట్టే తిరుగుతూ ఉంటుంది. ప్రకృతి – మనిషి పరస్పర ఆధార ఆధేయాలైన స్వతంత్ర ఉనికిలో ఉంటారు తప్ప పెట్టుబడికి స్వతంత్ర ఉనికి లేదు. ప్రతిపత్తి లేదు. శ్రామిక శక్తి హస్తాలకు, ఉత్పత్తి సాధనాలను, వనర్లను అందకుండా స్తంభింపచేస్తే, కుప్పకూలి పోయేవి ఇరవయ్యేడేకాదు ఇంకెన్ని అంతస్తులైనా కావచ్చు. అది నిస్త్రాణ.

అయితే ఇవ్వాళ ఈ ఆభాసయే ప్రపంచీకరణగా భాసిస్తున్నది. నూతన ఆర్థిక విధానం పేరుతో, అభివృద్ధి పేరుతో, పెరిగిన వృద్ధి రేటు పేరుతో ఇవి మనముందు ఒక మాయాజాలాన్ని పరచి ఆత్మవంచన చేసుకుంటూ ప్రజా వంచనకు పాల్పడుతున్నది.

భూదాహంతో, వనర్ల దాహంతో, ప్రత్యేక ఆర్థిక మండలాలు, గనుల తవ్వకాలు, పవర్ ప్రాజెక్టులు, ఉక్కు కర్మాగారాలు, సముద్రతీర పారిశ్రామిక, పర్యాటక ఛారిడార్లు వంటి పేర్లతో మనుషుల కాళ్లకింద నేల మిగలకుండా చేసి చాప చుట్టగా చుట్టి బహుళ జాతి కంపెనీలకు, బడా కంపెనీలకు అప్పనంగా అర్పిస్తున్న దళారీ స్వభావం గురించి అరుంధతీ రాయ్ ఈ పుస్తకంలో సాధికారికంగా, ప్రామాణికంగా వివరాలతో, విశ్లేషణతో మన కళ్లకు కడుతున్నది.

ఈ దోపిడీ రాజకీయార్థిక రంగంలోనే కాదు సామాజిక, విద్యా, సాంస్కృతిక రంగాల్లో కూడ ఎంత మాయజలతారులా పరచుకున్నట్టున్నదో ఆ అంతస్సంబంధాలను మేడిపండు వొలిచి మన చేతుల్లో పెడుతున్నది. ఒక సృజనాత్మక రచయితగా ఆమె బుద్ధి జీవులు – పెట్టుబడికి కలం కూలీల దశ నుంచి సామ్రాజ్యవాద ప్రలోభానికి లోనయ్యే సాంస్కృతిక దళారీలుగా తెలిసీ, తెలియక, సంకల్పపూర్వకంగా, అసంకల్పితంగా ఎట్లా లోనవుతున్నారో కూడా వివరించింది. తెలుగు సమాజం అనుభవంలో కొన్ని చేర్పులు చేయగలమేమో తప్ప – మనం ఆత్మలోకంలో ఇప్పటికే దివాలా తీసి ఉంటే తప్ప – చదవడం ముగించి ఆత్మన్యూనతాభావంతో గిల్టీగా మిగిలిపోవాల్సిందే.

మన అమ్మ జ్ఞాపకాలు జిఎంఆర్‌లు, మన చరిత్ర, సంస్కృతి, పర్యావరణం గురించి రాంకీలు, మన సాహిత్య సున్నితత్వాలు సోంపేట కాల్పుల సన్నాహాలతో నాగార్జున దళారీ ధర్మానలు (ధర్మం మీద ఒట్టు) గా నిర్దేశిస్తున్న వర్తమానంలో ఆత్మావలోకనానికి ఈ ప్రేతాత్మ ఏమాత్రం ప్రేరణ అయినా బతికిపోతాం.

– వరవరరావు

19.06.2012



అంటిల్లా: అల్టామౌంట్ రోడ్డులో ముఖేష్ అంబానీ 27 అంతస్తుల ఇల్లు. ధగధగలాడే దాని దీపకాంతులు తమ రాత్రులను కొల్లగొట్టాయని ఇరుగుపొరుగు వాళ్లు ఫిర్యాదు చేస్తున్నారు.

ఇది నాలుగు గోడల ఆశ్రయమా, సుఖసంతోషాల స్వగృహమా? నవీన భారత దేవాలయయమా, దాని ప్రేతాత్మల గిడ్డంగా? ముంబాయిలోని అల్టామాంట్ రోడ్డులో భయ విహ్వలత, మార్మికతలను చిమ్ముతూ "అంటిల్లా" వచ్చిన తరువాత పరిస్థితులు మునుపటిలా లేవు. నన్ను అక్కడికి తీసుకెళ్లిన మిత్రుడు "ఇదిగో చేరుకున్నాం. కొత్త పాలకులకు ప్రణమిల్లు," అన్నాడు.

ఈ అంటిల్లా భారత దేశంలో అత్యంత సంపన్నుడైన ముఖేష్ అంబానీది. ఇరవై ఏడు అంతస్తులు, మూడు హెలిప్యాడ్లు, తొమ్మిది లిఫ్టులు, వేలాడే తోటలు, నాట్యశాలలు, వాతావరణ గదులు, వ్యాయామశాలలు, ఆరు అంతస్తులలో పార్కింగ్, ఆరు వందల మంది సేవకులతో ఇప్పటి వరకు కనీ, వినీ ఎరుగని ఖర్చుతో నిర్మించిన ఈ ఇంటి గురించి చదివాను. ఇరవై ఏడు అంతస్తుల పొడవునా లోహ చద్రంపై వేసిన నిట్టనిలువు పచ్చికకి నేను సన్నద్ధమై లేను. ఆ పచ్చిక గడ్డి అక్కడక్కడా ఎండిపోయి ఉంది, పెచ్చులు పెచ్చులుగా అక్కడక్కడా పూర్తిగా రాలిపోయింది. "సంపద బొట్లు బొట్లుగా కిందికి జారే' సిద్ధాంతం[1] పని చెయ్యలేదని స్పష్టమవుతోంది.

సంపద 'పైకి ఎగదన్నే'[2] సిద్ధాంతం మాత్రం బాగా పనిచేస్తోంది. అందుకే 120 కోట్ల జనాభా ఉన్న దేశంలో వందమంది అత్యంత సంపన్నుల ఆస్తులు దేశ స్థూల ఉత్పత్తి (జిడిపి)లో నాలుగో వంతును ఆక్రమిస్తున్నాయి.

ఇంత ఖర్చు పెట్టి కట్టుకున్న అంటిల్లాలో అంబానీలు ఉండడం లేదని బజారులో (న్యూయార్క్ టైమ్స్ పత్రికలో కూడ) చెప్పుకుంటున్నారు, కనీసం చెప్పుకున్నారు. నిజమేమిటో ఎవ్వరికీ తెలియదు.

దయ్యాలనీ, చెడు శకునాలనీ, వాస్తు అనీ, ఫెంగ్‌షూయి అనీ ప్రజలు ఏవో గుసగుసలాడుకుంటున్నారు. తప్పంతా కార్ల్ మార్క్స్‌దేనేమో (ఎన్ని శాపనార్థాలు పెట్టాడు!). "తన మంత్రాలతో పైకి తెచ్చిన పాతాళలోకశక్తులను నియంత్రించ లేకపోతున్న మాంత్రికుడిలాగా తాను సృష్టించిన భారీ ఉత్పత్తి సాధనాలతో, వినిమయంతో" పెట్టుబడిదారీ విధానం తన్నుకులాడుతోంది అని అతడన్నాడు.

అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐ.ఎం.ఎఫ్.) "సంస్కరణల" అనంతర, కొత్త మధ్య తరగతికి చెందిన 30 కోట్ల భారత పౌరులం పాతాళలోక శక్తులతో, ఎండిపోయిన నదులు, బావులు, బోడిగా మారిన కొండలు, అంతరించిపోయిన అడవుల ప్రేతాలతో; అప్పులలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకున్న రెండున్నర లక్షల మంది రైతుల ఆత్మలతో; మన పురోగతి కోసం ఆస్తులు కొల్లగొట్టబడి, మరింత పేదరికంలోకి నెట్టబడి రోజుకి 20 రూపాయల కంటే తక్కువతో బతుకునీడుస్తున్న 80 కోట్ల మంది ప్రజలతో సహజీవనం చేస్తున్నాం.

---

1. 'సంపద బొట్లు బొట్లుగా కిందికి జారే' సిద్ధాంతం: Trickle Down Theory - ఒక దేశం మొత్తంగా అభివృద్ధి సాధిస్తూ ఉంటే దాని ఫలాలు పేదలకు కూడా అందుతాయి అని చెప్పే సిద్ధాంతం. కాబట్టి దేశం ప్రగతి సాధిస్తున్నంత వరకు పని లేదు అని ఈ సిద్ధాంతం చెబుతుంది.
2. 'పైకి ఎగదన్నే' సిద్ధాంతం: 'Gush Up' - Trickle Down Theoryకి వ్యంగ్యంగా రచయిత్రి చేసిన పద ప్రయోగం.

ముఖేష్ అంబానీ ఆస్తుల విలువ 2000 కోట్ల డాలర్లు. 4700 కోట్ల డాలర్ల విలువ చేసే రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్.ఐ.ఎల్.)లో అతడికి అత్యధిక వాటా ఉంది. అతడి ప్రపంచ వాణిజ్య ప్రయోజనాలలో పెట్రో రసాయనాలు, చమురు, సహజ వాయువు, పాలియెస్టర్ ఫైబర్, ప్రత్యేక ఆర్థిక మండలాలు (ఎస్.ఐ.జడ్.లు), ఆహార సరుకుల దుకాణాలు, ఉన్నత పాఠశాలలు, జీవ శాస్త్ర పరిశోధనలు, మూల కణ నిలువ వ్యాపారం వంటివి ఉన్నాయి. ఇటీవల ఇన్ఫోటెల్‌లో 95 శాతం వాటాని ఆర్.ఐ.ఎల్. కొన్నది. ఈ ఇన్ఫోటెల్‌కి సి.ఎన్.ఎన్. - ఐ.బి.ఎన్., ఐ.బి.ఎన్. లైవ్, సి.ఎన్.బి.సి., ఐ.బి.ఎన్., లోక్‌మత్, దాదాపుగా అన్ని ప్రాంతీయ భాషలలోని ఈటీవీలతో సహా వార్తలు, వినోదాలకు సంబంధించిన 27 ఛానళ్లు ఉన్నాయి. 4జి బ్రాడ్ బ్యాండ్ (ఇది అధిక వేగ 'సమాచార వాహకం', ఈ సాంకేతిక విజ్ఞానం అమలులోకి వస్తే భవిష్యత్తులో సమాచార ప్రసారాలకు ఇదే మార్గమవుతుంది) లో దేశ వ్యాప్త లైసెన్సు ఉన్న ఏకైక కంపెనీ ఇన్ఫోటెల్. అంబానీకి ఒక క్రికెట్ జట్టు కూడా ఉంది.

భారతదేశాన్ని నడిపిస్తున్న అతికొద్ది కార్పొరేషన్లలో ఆర్ఐఎల్ ఒకటి. ఆ జాబితాలు మరికొన్ని కంపెనీలు: టాటా, జిందాల్, వేదాంత, మిట్టల్, ఇన్ఫోసిస్, ఎస్సార్, ముఖేష్ సోదరుడు అనిల్ చేతుల్లో ఉన్న మరో రిలయన్స్ (అనిల్ ధీరూబాయి అంబానీ గ్రూప్ - ఎడిఎజి). ఇంకా ఇంకా పెరిగి పోవడం కోసం వారి పరుగు యూరపు, మధ్య ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలకు విస్తరించింది. వారి వలలు - కనపడేవీ, కనపడనివీ; బహిరంగంగా ఉండేవీ, రహస్యంగా ఉండేవీ - దూరదూరాలకు విసరబడ్డాయి. ఉదాహరణకు టాటాలకు 80 దేశాలలో వందకి పైగా కంపెనీలు ఉన్నాయి. భారత దేశంలో అతి పురాతన, అతిపెద్ద ప్రైవేటు రంగ విద్యుత్ కంపెనీ వీళ్లదే. వీళ్లకి గనులు, చమురు క్షేత్రాలు, ఉక్కు కర్మాగారాలు, టెలిఫోను, కేబుల్ టీవి, బ్రాడ్‌బ్యాండ్ నెట్‌వర్క్‌లు ఉన్నాయి. పట్టణాలకి పట్టణాలే వీరి అధీనంలో ఉన్నాయి. కార్లు, ట్రక్కులు తయారీ చేస్తున్నారు. తాజ్ హోటళ్లు, జాగ్వార్, ల్యాండ్ రోవర్, దేవూ, టెట్లీ టీ, ఒక ప్రచురణ సంస్థ, గొలుసు పుస్తక దుకాణాలు, బయోడైజ్ ఉప్పులో అతిపెద్ద బ్రాండు, సౌందర్య సాధనాల లాక్మే సామ్రాజ్యం టాటాల సొంతం. తమ ప్రకటనలలో ఉపశీర్షికగా "మేం లేకపోతే మీకు బతుకులేదు," అని వాళ్లు రాసుకోవచ్చు.

సంపద పైకి ఎగతన్నే సిద్ధాంత సుభాషితాల ప్రకారం ఎంత ఎక్కువ ఉంటే అంత ఎక్కువ పొందవచ్చు.

'ప్రతి దానిని ప్రైవేటీకరించే' యుగంతో భారతదేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోకెల్లా

అవినీతి తరంగం : 2జి కుంభకోణంలో జైలుకి తరలించబడుతున్న ఎ. రాజా.

అత్యంత వేగంగా వృద్ధి చెందుతోంది. అయితే, పాతకాలపు వలస దేశాల మాదిరి దాని ఎగుమతులలో ఖనిజాలే ప్రధానమైనవి. భూమి లోతైన పొరల నుంచి తవ్వి డబ్బు ప్రవహింప చేసే గొట్టాల ముందుకి తమ కండబలంతో చేరుకోగలిగిన టాటా, జిందాల్, ఎస్సార్, రిలయన్స్, స్టెరిలైట్ వంటి కంపెనీలు భారత దేశపు అతిపెద్ద కంపెనీలుగా రూపొందాయి. తాము కొననక్కరలేని దాన్ని అమ్ముకోగలగడం అన్న వ్యాపారవేత్తల కల నిజమైనట్లుంది.

* * *

కార్పొరేట్ సంపదకి మరో ప్రధాన వనరు వాటి భూకమతాలు. వాల్‌స్ట్రీట్ బ్రోకర్లు, వ్యవసాయ-వాణిజ్య కార్పొరేషన్లు, చైనా దేశపు కోటీశ్వరులు పెద్ద మొత్తంలో భూమిని కొనుగోలు చేసేలా ప్రపంచ వ్యాప్తంగా బలహీన, అవినీతి ప్రభుత్వాలు దోహదం చేశాయి. (భూమితో పాటు వీళ్లకి నీరు కూడా హక్కు భుక్తమయ్యింది.) భారతదేశంలో "ప్రజా ప్రయోజనం" పేరుతో – ప్రత్యేక ఆర్థిక మండలాలకు, మౌలిక వసతుల పథకాలకు, ఆనకట్టలకు, రహదారులకు, కార్ల ఉత్పత్తికి, రసాయనిక కర్మాగారాలకు, ఫార్ములా వన్ రేసింగ్‌కీ లక్షలాది మంది ప్రజల భూమిని సేకరించి ప్రైవేటు కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నారు. (వేదల విషయంలో వ్యక్తిగత ఆస్తి పవిత్రమైనదేమీ కాదు.) స్థానిక ప్రజలను నిర్వాసితులను చెయ్యడం, వారికున్నదంతా లాక్కోవడం వారి ఉపాధి కల్పనలో భాగమని ఎప్పటిలాగానే కట్టు కథలు చెబుతారు.

స్థూల జాతీయోత్పత్తి వృద్ధికీ, ఉపాధి కల్పనకీ మధ్య సంబంధం ఏమీ లేదని ఇప్పుడు మనందరికి స్పష్టమైపోయింది. ఇరవై సంవత్సరాల "ప్రగతి" తర్వాత భారతదేశంలోని శ్రామికశక్తిలో 60 శాతం స్వయం ఉపాధిలో ఉంది; శ్రామికులలో 90 శాతం అసంఘటిత రంగాలలో పని చేస్తున్నారు.

స్వాతంత్రం వచ్చిన తరువాత, 1980ల వరకు కూడా భూసంస్కరణల కోసం, భూమి లేని నిరుపేద ప్రజలకు ఫ్యూడల్ భూస్వాముల భూముల పునఃపంపిణీ కోసం నక్సలైట్ల నుంచి జయప్రకాశ్ నారాయణ్ సంపూర్ణ క్రాంతి వరకు ఎన్నో ప్రజా ఉద్యమాలు నడిచాయి. భూమి లేదా సంపద పునఃపంపిణీ గురించి ఇప్పుడు ఎవరైనా మాట్లాడితే అప్రజాస్వామికంగానే కాక పిచ్చివాళ్లకింద జమకట్టబడతారు. అత్యంత మిలిటెంట్ ఉద్యమాలు కూడా ప్రజలకున్న కొద్దిపాటి భూమిని రక్షించుకోవటానికి పరిమితమైపోయాయి. ఊళ్లనుంచి తరుమబడి చిన్న, పెద్ద పట్టణాలలోని మురికివాడల్లో, ఇరుకు గదులలో నివసిస్తున్న కోట్లాది ప్రజల (వీరిలో అధిక శాతం దళితులు, ఆదివాసీలు) ప్రస్తావన మౌలిక చర్చలలో సైతం ఉండడం లేదు.

పైకి ఎగదన్నే సిద్ధాంతం ప్రకారం మెరుస్తున్న గుండు సూది మొనపై సంపద కేంద్రీకృతమౌతోంది. మన కోటీశ్వరులు దానిపై మునిగాళ్ల మీద నాట్య విన్యాసాలు చేస్తున్నారు. మరోవైపు ప్రజాస్వామిక సంస్థలైన న్యాయస్థానాలకు, పార్లమెంటుకు, ప్రసార సాధనాలకు సైతం డబ్బు వరదలు పోటెత్తుతూ వాటి పని తీరులో తీవ్రంగా రాజీపడేలా చేస్తోంది. ఎన్నికల పండగలప్పుడు కోలాహలం ఎంత ఎక్కువగా ఉంటే, ప్రజాస్వామ్యంపై మన నమ్మకం అంత బలహీనం అవుతూ ఉంటుంది.

భారత దేశంలో వెల్లడవుతున్న ప్రతి కొత్త అవినీతి భాగోతం ముందు పాత అవినీతి పేలవంగా కనబడుతోంది. 2011 వేసవిలో 2జి స్పెక్ట్రంలో అవినీతి వెల్లడయింది. తమకి కావలసిన వ్యక్తిని కేంద్ర టెలికమ్యూనికేషన్ మంత్రిగా నియమింప చేసుకుని, 2జి టెలికాం స్పెక్ట్రం లైసెన్సు ధరలను గణనీయంగా తగ్గించేసుకుని, మిత్రులైన వాళ్లందరికీ అక్రమంగా కేటాయింప చేసుకుని 4000 కోట్ల డాలర్ల ప్రజల ధనాన్ని కార్పొరేషన్లు గుటకాయ స్వాహా చేశాయని మనం తెలుసుకున్నాం. ప్రసార సాధనాలకు వెల్లడి అయిన రికార్డు చేసిన సంభాషణల ద్వారా పారిశ్రామిక వేత్తలు, వారి కంపెనీలు, మంత్రులు, సీనియర్ పాత్రికేయులు, ఒక టీవి యాంకర్ ఈ పట్టపగలు దోపిడీలో పాల్పడిన విధానం బట్టబయలైంది. ప్రజలు ఏనాడో నిర్ధారించిన రోగానికి ఈ టేపులు రుజువులుగా నిలిచాయంతే.

టెలికాం స్పెక్ట్రం ప్రైవేటీకరణ, అక్రమ అమ్మకాలు వంటి వాటిలో యుద్ధం, ప్రజలు నిర్వాసితులు కావడం, పర్యావరణం విధ్వంసం కావడం వంటివి లేవు.

కాని భారతదేశపు కొండల, నదుల, అడవుల ప్రైవేటీకరణలో ఇవన్నీ ఉన్నాయి. జమా ఖర్చు లెక్కలలో తేలికగా అర్థమయ్యే అవినీతి కాకపోవడం వల్లనో, దేశ "ప్రగతి" పేరుతో ఇదంతా జరుగుతున్నందునో మధ్య తరగతి ప్రజలలో దీనిపట్ల అంతగా ప్రతిస్పందన లేదు.

వేలకోట్ల విలువ చేసే బాక్సైట్‌ను, ఇనుమును, ఇతర ఖనిజాలను స్వేచ్ఛా విపణి సిద్ధాంతాలకు సైతం విరుద్ధంగా, నామమాత్రపు మొత్తాలకి (ప్రభుత్వానికి 0.5 నుంచి 7 శాతం రాయల్టీకి) ప్రైవేటు కార్పొరేషన్లకు కట్టబెడుతూ 2005లో ఛత్తీస్‌గఢ్, ఒడిషా, జార్ఖండ్ రాష్ట్ర ప్రభుత్వాలు వందలాది అవగాహనా పత్రాలపై సంతకాలు చేశాయి.

బస్తర్‌లో సమీకృత ఉక్కు కర్మాగారం నిర్మాణానికి టాటా స్టీల్‌తో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం అవగాహన పత్రంపై సంతకం చేసిన కొద్ది రోజులకే సల్వా జుడుం పేరుతో ఒక ప్రైవేటు సైన్యం ఏర్పాటయింది. అడవుల్లో మావోయిస్టు గెరిల్లాల "అణిచివేత"కు విసిగిపోయిన ప్రజలు స్వచ్ఛందంగా తిరగబడడంగా ప్రభుత్వం సల్వా జుడుంని పేర్కొంది. కార్పొరేషన్లకు అనువుగా రంగాన్ని సిద్ధం చెయ్యడం కోసం గనుల కంపెనీల నుంచి ఆర్థిక సహకారంతో ప్రభుత్వం ఏర్పాటు చేసి, ఆయుధాలు సమకూర్చిన దళాలే సల్వా జుడుం అన్న వాస్తవం తర్వాత వెల్లడయింది. ఇతర రాష్ట్రాలలో, ఇతర పేర్లతో ఇలాంటివే ప్రైవేటు సైన్యాలు ఏర్పడ్డాయి.

"భారత దేశానికి అతిపెద్ద తీవ్రవాద ముప్పు మావోయిస్టుల నుంచే," అని ప్రధాన మంత్రి ప్రకటించాడు. యుద్ధానికి నాంది పలికాడు.

2006 జనవరి 2న పొరుగు రాష్ట్రమైన ఒడిషాలోని కళింగనగర్‌లో మరొక టాటా ఉక్కు కర్మాగారం వద్ద తమ భూములకు సరైన నష్ట పరిహారం చెల్లించలేదంటూ నిరసన చేస్తున్న గ్రామస్తుల పైకి ప్రభుత్వం పది ప్లటూన్ల (ఒక్కొక్క ప్లటూన్‌లో 26–50 మంది పోలీసులు ఉంటారు) పోలీసులను పంపి కాల్పులు జరిపించి తన దృఢ నిశ్చయాన్ని చాటింది. ఈ ఘటనలో ఒక పోలీసుతో సహా పదముగ్గురు చనిపోయారు, 37 మంది గాయపడ్డారు. ఇది జరిగి ఆరు సంవత్సరాలు గడిచిపోయాయి. ఇప్పటికీ ఆ గ్రామాలు పోలీసుల ముట్టడిలోనే ఉన్నాయి, అయినా ప్రజలు నిరసనను విరమించుకోలేదు.

ఈలోగా ఛత్తీస్‌గఢ్‌లో సల్వా జుడుం వందలాది అటవీ గ్రామాలను తగలబెట్టి, అత్యాచారాలకు, హత్యలకు పాల్పడి 600 గ్రామాలను ఖాళీ చేయించింది. దాంతో 3,50,000 మంది ఊళ్లు విడిచి పారిపోయారు; 50,000 మంది పోలీసు క్యాంపులలో చేరాల్సి వచ్చింది. అడవుల నుంచి బయటకు రాని వాళ్లని 'మావోయిస్టు

తీవ్రవాదులు'గా పరిగణించాల్సి వస్తుందని ముఖ్యమంత్రి ప్రకటించాడు. అంటే ఆధునిక భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలో పాలాలు దున్నడం, విత్తులు విత్తడం తీవ్రవాద కార్యక్రమంగా నిర్వచిస్తున్నారన్న మాట. అంతిమంగా సల్వా జుడుం అత్యాచారాలు ప్రజా ప్రతిఘటన బలపడేలా, మావోయిస్టు గెరిల్లా సైనికుల సంఖ్య పెరిగేలా చేశాయి. ప్రభుత్వం 2009లో 'ఆపరేషన్ గ్రీన్ హంట్'ని ప్రకటించింది. ఛత్తీస్‌గఢ్, ఒడిషా, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్‌లో రెండు లక్షల పారామిలటరీ దళాలను మోహరించారు.

మూడేళ్లపాటు (సల్వా జుడుం ద్వారా) సాగిన 'మంద్రస్థాయి యుద్ధం' అడవుల నుంచి తిరుగుబాటు దారులను బయటకు వెళ్లగొట్టడంలో విఫలం కావడంతో భారత సైన్యాన్ని, వాయుసేనను రంగంలోకి దించుతున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కాని దీన్ని యుద్ధం అనడం లేదు. "పెట్టుబడులకు అనువైన వాతావరణాన్ని కల్పించడం" అంటున్నారు. వేల సంఖ్యలో సైనికులు ఇప్పటికే రంగంలోకి దిగారు. ఒక బ్రిగేడ్ (సుమారుగా 5000 సైనికులు ఉంటారు) కేంద్ర కార్యాలయం, విమానాశ్రయాలు సిద్ధమవుతున్నాయి. ప్రపంచంలోకెల్లా అతిపెద్ద సైన్యాలలో ఒకటి ప్రస్తుతం ప్రపంచంలోకెల్లా అత్యంత పేదల నుంచి, ఆకలిగొన్న, పోషకాహార లోపం ఉన్న ప్రజల నుంచి తనను తాను రక్షించుకోటానికి యుద్ధ సన్నాహాలు చేస్తోంది. సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టం (ఎ.ఎఫ్.ఎస్.పి.ఎ.) అమలు చెయ్యడం ఒక్కటే మిగిలి ఉంది; దీని ద్వారా సైన్యానికి చట్టం నుంచి రక్షణ లభిస్తుంది, "అనుమానం" వస్తే ఎవరినైనా చంపేసే హక్కు లభిస్తుంది. కాశ్మీరు, మణిపూర్, నాగాలాండ్‌లలో పేరు లేని వేలాది సమాధులు, అనామక శవాల దహనకాండలు చూస్తూ ఉంటే ఈ సైన్యం అత్యంత అనుమానాస్పద సైన్యం అని చూపుకుంటోంది.

ఒకవైపు సైనిక మోహరింపుకి సన్నాహాలు జరుగుతూ ఉంటే మరోపక్క మధ్య భారతంలోని అడవుల ముట్టడి కొనసాగుతూనే ఉంది. అక్కడి గ్రామస్తులు బయటకు రావాలన్నా; ఆహారం, మందులు కొనుక్కోవటానికి మార్కెటుకి వెళ్లాలన్నా భయపడిపోతున్నారు. అప్రజాస్వామిక, క్రూర చట్టాలనుపయోగించి, మావోయిస్టులనే నేరం మోపి వందలాది మందిని జైళ్లపాలు చేస్తున్నారు. ఆదివాసీ ప్రజలతో జైళ్లు కిక్కిరిసిపోతున్నాయి. వీరిలో అధికశాతం మందికి తాము చేసిన నేరం ఏమిటో కూడా తెలియదు. ఇటీవల సోనీ సోరి అనే ఆదివాసీ ఉపాధ్యాయురాలిని పోలీసులు అరెస్టు చేసి, హింసించారు. మావోయిస్టు వార్తాహరురాలనని నేరం అంగీకరించ మంటూ ఆమె మర్మావయంలోకి రాళ్లు చొప్పించారు. ప్రజల నిరసనల మధ్య ఆమెను

వైద్య పరీక్షకు కోల్‌కతా తరలించారు. అక్కడ ఆమె యోని నుంచి రాళ్లను బయటకు తీశారు. ఇటీవలి సుప్రీంకోర్టు వాయిదాలో కార్యకర్తలు ప్లాస్టిక్ సంచిలో ఉంచిన ఈ రాళ్లను జడ్జీలకు చూపించారు. వీటన్నింటి ఫలితం ఏమిటి? సోనీ సోరి ఇంకా జైలులోనే మగ్గుతోంది. ఆమెను చిత్రహింసల పాలు చేసిన ఎస్‌పి అంకిత్ గార్గ్‌కి గణతంత్ర దినోత్సవం నాడు రాష్ట్రపతి చేతుల నుంచి శౌర్య పతకం లభించింది.

పెద్ద ఎత్తున ప్రజల తిరుగుబాటు, తత్ఫలిత యుద్ధ కారణంగానే మధ్య భారతంలో జీవావరణ, సామాజిక పునర్నిర్మాణం గురించి వింటున్నాం. ప్రభుత్వం ఏ సమాచారమూ వెల్లడి చేయడం లేదు. అన్ని అవగాహనా పత్రాలూ రహస్యాలే. మధ్య భారతంలో జరుగుతున్న దానిపైకి ప్రజల దృష్టిని ఆకర్షించడానికి ప్రసార సాధనాలలో కొన్ని తమ పరిధి మేరకు చేశాయి. అయితే, భారత ప్రసార సాధనాలలో చాలావాటికి వాటి ప్రకటనల ఆదాయంలోని అధిక మొత్తం కార్పొరేట్ల ప్రకటనల ద్వారానే సమకూరుతోంది కాబట్టి అవి ఏమీ చెయ్యలేని స్థితిలో ఉన్నాయి. ఇది చాలదన్నట్టు ప్రసార సాధనాలు, బడా వ్యాపారాల మధ్య విభజన రేఖ అస్పష్టంగా మారే పరిస్థితి ఏర్పడుతోంది. ఆర్ఐఎల్ ఆధీనంలో 27 టీవి ఛానళ్లు ఉన్నాయని చూశాం. ఇందుకు భిన్నంగా కూడా జరుగుతోంది. ప్రసార సాధనాల సంస్థలు వ్యాపారంలోకి దిగుతున్నాయి, కార్పొరేట్ రంగంలోకి ప్రవేశిస్తున్నాయి. ఉదాహరణకు మధ్య భారతంలోని ప్రముఖ దినపత్రిక అయిన దైనిక్ భాస్కర్‌కి 13 రాష్ట్రాలలో ఇంగ్లిషు, హిందీతో సహా నాలుగు భాషలలో 1.75 కోట్ల పాఠకులు ఉన్నారు. గనులు, విద్యుదుత్పత్తి, స్థిరాస్తి వ్యాపారం (ఇళ్ల స్థలాలు), వస్త్ర పరిశ్రమల వంటి రంగాలలో ఉన్న 69 కంపెనీలు దైనిక్ భాస్కర్‌కి ఉన్నాయి. ఓపెన్ కాస్ట్ బొగ్గు గనికి సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ వేదిక ఫలితాన్ని ప్రభావితం చెయ్యటానికి డిబి పవర్ లిమిటెడ్ (దైనిక్ భాస్కర్ కంపెనీలలో ఒకటి) తమ బృందానికి ఉన్న వార్తా పత్రికలను కావాలని, చట్టవిరుద్ధ, ప్రజాభిప్రాయాలను మలిచే చర్యలకు వాడుకుందని ఇటీవల హైకోర్టులో ఒక రిట్ పిటిషన్ దాఖలయ్యింది. ప్రజా వేదిక ఫలితాలను ప్రభావితం చెయ్యటానికి ప్రయత్నాలు జరిగాయా లేదా అన్నది ఇక్కడ అప్రస్తుతం. ప్రసార సాధనాలు ఆ స్థితిలో ఉన్నాయన్నది గుర్తించాలి, ఆ శక్తి వాటికుంది. ప్రయోజనాల మధ్య తీవ్ర ఘర్షణను అనుమతించేలా దేశ చట్టాలు ఉన్నాయి.

* * *

దేశంలో మరికొన్ని ప్రాంతాల నుంచి అసలు ఎటువంటి వార్తలూ బయటకు రావడం లేదు. ఈశాన్య రాష్ట్రమైన అరుణాచల్ ప్రదేశ్‌లో జనాభా తక్కువ, సైనికులు ఎక్కువ అన్నట్టు ఉంటుంది. ఇక్కడ 168 పెద్ద ఆనకట్టలు కడుతున్నారు. వీటిలో అనేకం ప్రైవేటు రంగంలో ఉన్నాయి. ఏకంగా జిల్లానే ముంచేసేడంత పెద్ద ఆనకట్టలను కాశ్మీరు, మణిపూర్‌లలో కడుతున్నారు. విద్యుత్తు కోతలపై నిరసన వ్యక్తం చేస్తేనే కాల్చిపారేసేడంతగా సైనిక పెత్తనం ఈ రాష్ట్రాలలో సాగుతోంది. (కొన్ని వారాల క్రితం ఇది కాశ్మీరులో నిజంగా జరిగింది.) ఇక ఆనకట్ట నిర్మాణాన్ని ఎలా ఆపుతారు? అన్నింటిలోకి (వి)భ్రాంతి కలిగించే ఆనకట్ట గుజరాత్‌లోని కల్పాసర్. ఇది ఖంబట్ అగాధానికి అడ్డంగా నిర్మించ తలపెట్టిన 34 కిలోమీటర్ల పొడవైన ఆనకట్ట. ఈ ఆనకట్ట మీద పది వరసల రహదారి, ఒక రైల్వే మార్గం ఉంటాయి. సముద్రపు ఉప్పు నీరు భూమి లోపలికి రాకుండా చేసే ఈ ఆనకట్ట ద్వారా గుజరాత్ నదీ జలాలతో తీపి నీటి సరస్సును నిర్మించాలన్నది ఆలోచన. (ఇప్పటికే ఈ నదుల ప్రవాహం పిల్ల కాలవగా మారిందని కానీ, రసాయనిక వ్యర్థాల కాలుష్యంతో ఆ జలాలు విషతుల్యంగా మారాయన్నది కానీ పట్టించుకోవద్దు.) కల్పాసర్ ఆనకట్ట వల్ల సముద్ర నీటి మట్టం పెరిగి వందల కిలోమీటర్ల మేర తీరప్రాంత జీవావరణాన్ని అది మార్చివేస్తుందని పది సంవత్సరాల క్రితమే దానిని తిరస్కరించారు. ధొలేరా ప్రత్యేక పెట్టుబడి ప్రాంతానికి (ఎస్ఐఆర్)కి నీటి సరఫరా పేరుతో ఈ ఆనకట్ట మళ్లీ తెరమీదకి వచ్చింది. భారతదేశంలోనే కాక ప్రపంచలోనే అత్యంత తీవ్ర నీటి ఎద్దడి ఉన్న ప్రాంతం ధొలేరా. సెజ్‌లకు మరో పేరే ఎస్ఐఆర్. కార్పొరేట్ల స్వయంపాలిత ఇష్టారాజ్యాలలో పారిశ్రామిక కేంద్రాలు, నివాస ప్రాంతాలు, మహాపట్టణాలు ఇందులో నిర్మింపబడతాయి. ధొలేరా ఎస్ఐఆర్‌ని గుజరాత్‌లోని ఇతర నగరాలతో పది వరసల రహదారితో కలుపుతారు. వీటన్నిటికీ డబ్బు ఎక్కడి నుంచి వస్తుంది?

2011 జనవరిలో మహాత్మా (గాంధీ) మందిర్‌లో వంద దేశాల నుంచి వచ్చిన పదివేల మంది అంతర్జాతీయ వ్యాపారవేత్తలతో గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర మోడీ సమావేశమయ్యాడు. ప్రసార సాధనాలలో వచ్చిన వార్తల ప్రకారం గుజరాత్‌కి 45000 కోట్ల డాలర్ల పెట్టుబడి తెస్తామని వీళ్లు చెప్పారు. 2002 ఫిబ్రవరి – మార్చిలలో జరిగిన రెండువేల మంది ముస్లిముల హత్యాకాండ జరిగి పదవ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న తరుణంలో ఈ సమావేశాన్ని మోడీ ఏర్పాటు చేశాడు. ఈ హత్యలను ఆమోదించడమే కాదు క్రియాశీలంగా ప్రోత్సహించాడన్న నేరారోపణను మోడీ ఎదుర్కొంటున్నాడు. తమ వాళ్లను ఖండ ఖండాలుగా నరకడం, సజీవంగా దహనం చెయ్యడం, బలాత్కారం చెయ్యడం చూసిన వాళ్లు, ఇళ్ల నుంచి తరిమివెయ్యబడిన

పదుల వేలల్లోని ప్రజలు తమకు ఏమైనా న్యాయం జరుగుతుందేమోనని ఇంకా ఎదురు చూస్తూ ఉన్నారు. కానీ మోడీ తాను ఎప్పుడూ ధరించే కాషాయ కండువా, నుదుట తిలకానికి బదులు బిజినెస్ సూటు వేసుకుని 45000 కోట్లు డాలర్ల రక్తపు కూటికి ఆశపడుతున్నాడు, బాకీ చెల్లిపోతుందని అనుకుంటున్నాడు. బహుశా అలాగే జరుగుతుందేమో. బడా వ్యాపారస్తులు అతడికి ఎంతో ఉత్సాహంతో మద్దతునిస్తున్నారు. అనంత న్యాయపు సమీకరణలు నిగూఢంగా పని చేస్తాయి.

ఒకదానిలో ఒకటి పట్టే అనంత కుటుంబం బొమ్మలలో అన్నింటికంటే చిన్నది ధొలేరా ఎస్ఐఆర్. ఢిల్లీ ముంబాయి పారిశ్రామిక కారిడార్‌కి (డిఎంఐసి) దీన్ని అనుసంధానం చేస్తారు. ఈ కారిడార్ 1500 కిలోమీటర్ల పొడవు, 300 కిలోమీటర్ల వెడల్పు ఉంటుంది. ఇందులో తొమ్మిది అతిపెద్ద పారిశ్రామిక ప్రాంతాలు ఉంటాయి; ఒక నిరాటంక సరుకు రవాణా మార్గం ఉంటుంది. మూడు ఓడరేవులు, ఆరు విమానాశ్రయాలు ఉంటాయి; ఎటువంటి అవాంతరాలు లేని ఆరు వరుసల రహదారి ఉంటుంది. 4000 మెగావాట్ల విద్యుదుత్పత్తి కేంద్రం ఉంటుంది. భారత, జపాన్ దేశ ప్రభుత్వాలు, వాటి కార్పొరేట్ భాగస్వాములు కలిసి ఈ డిఎంఐసిని ఏర్పాటు చేస్తున్నాయి. ఈ ప్రతిపాదనను మెకంజీ గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ తయారుచేసింది.

డిఎంఐసి వెబ్‌సైట్ ప్రకారం సుమారు 18 కోట్ల మంది ప్రజలు ఈ ప్రాజెక్టు వల్ల "ప్రభావితులవుతారు". ఈ "ప్రభావితులు కావడం" అంటే ఏమిటో అది వివరించదు. అనేక కొత్త నగరాలు నిర్మింపబడతాయని, ఈ ప్రాంత జనాభా ఇప్పటి 23.1 కోట్ల నుంచి 2019 నాటికి (అంటే ఏడు సంవత్సరాల కాలంలో) 31.4 కోట్లకు పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. కోట్లాది ప్రజలను ఒకచోటి నుంచి మరో చోటికి ఏ నియంత, ఏ నిరంకుశుడు ఇలా మార్చి ఎంత కాలం అయింది? ఇదంతా శాంతియుతంగా జరిగే ప్రక్రియేనా?

దేశవ్యాప్తంగా మోహరించమని ఆదేశాలు జారీ అయినప్పుడు కొరత లేకుండా ఉండటానికి భారత సైన్యం భర్తీ కార్యక్రమాన్ని చేపట్టాల్సి ఉంటుంది. మధ్య భారతంలో సైన్యం తన పాత్రకు సన్నద్ధమవుతూ 'మిలటరీ సైకలాజికల్ ఆపరేషన్స్' అన్న పత్రాన్ని నవీకరించి బహిరంగపరిచింది. దీని ప్రకారం దేశ రాజకీయ, సైనిక లక్ష్యాలను సాధించటాన్ని ప్రభావితం చేసేలా ఆశించిన దృక్పథాలు, ప్రవర్తన ఏర్పడేలా ఎంపిక చేసిన లక్షిత ప్రేక్షకులను ఉద్దేశించి ప్రత్యేక అంశాలతో కూడిన సందేశాలను ప్రణాళికాబద్ధమైన ప్రక్రియ ద్వారా జారీ చేస్తారు. సైన్యానికి అందుబాటులో ఉన్న ప్రసార సాధనాల ద్వారా "అవగాహనలను నియంత్రించే" ప్రక్రియను చేపడతారు.

భారత ప్రణాళికాకారులు ఆశిస్తున్న స్థాయిలో సామాజిక పునర్నిర్మాణాన్ని చేపట్టాలంటే బలప్రయోగం ఒక్కటే చాలదని భారత సైన్యపు అనుభవం చెపుతోంది. పేద ప్రజలపై యుద్ధం చేయడం వేరు. మిగిలిన మధ్య తరగతి, మేధో సంబంధ ఉద్యోగస్తులు, మేధావులు, "ప్రజాభిప్రాయాన్ని మలిచేవారు" వంటి మనబోటి వాళ్ల విషయంలో "అవగాహనలను నియంత్రించటానికి" పూనుకోవాల్సిందే. దీని గురించి తెలుసుకోవాలంటే కార్పొరేట్ ధర్మకర్తృత్వం అనే అద్భుత కళవైపు మన దృష్టిని మళ్లించాల్సి ఉంటుంది.

ఇటీవల కాలంలో పెద్ద పెద్ద గనుల కంపెనీలలో ముఖ్యమైనవి కళాపోషకులుగా మారాయి. 1990లలో అందాల పోటీలు తప్పించి వేరే కళలు ఉండేవి కాదు, కాని ఇప్పుడు వాటి స్థానంలో సినిమా, చిత్రకళ, సాహిత్య ఉత్సవాలు చోటు చేసుకుంటున్నాయి. బాక్సైట్ కోసం పురాతన డోంగ్రియా ఖోండ్ జాతి నివాసప్రాంతాలను తవ్వి పారేస్తున్న వేదాంత కంపెనీ సినిమా కళలోని యువత కోసం సుస్థిర అభివృద్ధిపై సినిమాల పోటీ నిర్వహిస్తోంది. వేదాంత కంపెనీ ఉపశీర్షిక 'ఆనందాన్ని తవ్వి తీయడం'. జిందాల్ బృందం ఒక సమకాలీన కళా పత్రికను ప్రచురిస్తోంది, భారతదేశంలోని ప్రముఖ కళాకారులకు మద్దతునిస్తోంది (వీళ్లు సహజంగానే స్టేన్‌లెస్ స్టీల్‌తో పనిచేస్తారు.) తెహెల్కా న్యూస్‌వీక్ నిర్వహించిన "థింక్ ఫెస్ట్"కి ముఖ్య పోషకురాలు ఎస్సార్ కంపెనీ - ప్రపంచ వ్యాప్తంగా ప్రముఖ రచయితలు, సామాజిక కార్యకర్తలు, వాస్తు శిల్పి ఫ్రాంక్ గెహ్రీ వంటి వారితో ఉద్వేగ, ఉద్విగ్న, ఉత్తేజిత చర్చలు ఉంటాయని ప్రచారం చేసింది. (గోవాలో పెద్ద ఎత్తున జరుగుతున్న చట్ట విరుద్ధ గనుల కుంభకోణాలను కార్యకర్తలు, పాత్రికేయులు వెలికితీస్తున్న సమయంలోనే ఈ పండగ గోవాలో జరిగింది. బస్తర్‌లో మొదలవుతున్న యుద్ధంలో ఎస్సార్ పాత్ర వెల్లడవుతున్న సమయం కూడా అదే.) టాటా స్టీల్, రియో టింటో (1873 లో ఏర్పాటైన బ్రిటిష్ - ఆస్ట్రేలియన్ గనుల కార్పొరేషన్ - దీనికి తనదైన ఘోర చరిత్ర ఉంది) ముఖ్య పోషకులుగా ఉన్న జైపూర్ సాహిత్య ఉత్సవాలను (దీని పూర్తి శాస్త్రీయ నామం దర్శన్ సింగ్ కన్‌స్ట్రక్షన్ జైపూర్ సాహిత్య ఉత్సవం) కళాభినివేశకులు 'ప్రపంచంలోకెల్లా అతిపెద్ద సాహిత్య ప్రదర్శన'గా పేర్కొన్నారు. టాటాలకు 'వ్యూహాత్మక బ్రాండ్ నిర్వాహకు'లైన కౌన్సెలేజ్ అన్న కంపెనీ ఈ ఉత్సవంలోని ప్రెస్ ప్రాంగణాన్ని స్పాన్సర్ చేసింది. ప్రేమ, సాహిత్యం, రాజకీయాలు, సూఫీ కవితలు వంటి వాటి గురించి చర్చించటానికి ప్రపంచంలోని ఉత్తమ రచయితలలో అనేక మంది జైపూర్‌కి వచ్చారు. నిషేధానికి గురైన సల్మాన్ రష్దీ పుస్తకం 'ది సటానిక్ వర్సెస్' నుంచి చదవడం ద్వారా కొంతమంది అతడి వాక్

స్వాతంత్రాన్ని కాపాడటానికి పూనుకున్నారు. ప్రతి ఫొటోలోనూ, టీవీ ఫ్రేంలోనూ వారి వెనక టాటా స్టీల్ లోగో (వారి ఉపశీర్షిక – ఉక్కుకన్నా దృఢమైన విలువలు) ఒక మంచి అతిథేయిలాగా ఆవహించి ఉంటుంది. ఇక్కడ వాక్ స్వాతంత్ర్యానికి శత్రువులు నెత్తురు కళ్ల జూసే ముస్లిం మూకలన్న మాట; ఉత్సవానికి వచ్చిన బడి పిల్లలకు సైతం వాళ్లు హాని చేసి ఉండేవారని నిర్వాహకులు మనకు చెప్పారు. (ముస్లింల విషయానికొచ్చే సరికి భారత ప్రభుత్వం, పోలీసులు ఎలా నిస్సహాయులుగా మారిపోతారన్నదానికి మనల్ని సాక్షులుగా నిలబెడతారు.) ఉత్సవానికి రష్దీని ఆహ్వానించటాన్ని కరడుగట్టిన దారుల్ – ఉలూం దేవబంది ఇస్లామిక్ మత పాఠశాల వ్యతిరేకించడం వాస్తవమే. ఉత్సవ వేదిక వద్ద నిరసనలు తెలియచెయ్యటానికి కొంత మంది ముస్లింలు గుమిగూడటమూ వాస్తవమే, వేదిక వద్ద రక్షణ ఏర్పాట్లు రాష్ట్ర ప్రభుత్వం చెయ్యకపోవడమూ ఖండించదగ్గ వాస్తవమే. అయితే, ఈ ఘటనలన్నిటికీ ఇస్లామిక్ మతోన్మాదులతో ఎంత సంబంధం ఉందో, ప్రజాస్వామ్యం, ఓటు బ్యాంకులు, ఉత్తరప్రదేశ్ ఎన్నికలతో కూడా అంతే సంబంధం ఉందన్నది గుర్తించాలి. ఇస్లామిక్ మతోన్మాదానికి వ్యతిరేకంగా వాక్ స్వాతంత్ర్యం కోరుకునే వారి పోరాడం ప్రపంచ వార్తాపత్రికలలో చోటు చేసుకుంది. వాళ్లకి కావలసింది ఇదే. అదవులలో జరుగుతున్న యుద్ధంలో ఈ ఉత్సవ పోషకుల పాత్ర, పేరుకుపోతున్న శవాల గుట్టలు, నిండిపోతున్న జైళ్లు వంటి వాటి గురించి ఎటువంటి వార్తలూ, నివేదికలూ లేవు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆలోచించడం కూడా శిక్షార్హమైన నేరంగా పరిగణించే చట్ట విరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం, చత్తీస్‌గఢ్ ప్రత్యేక ప్రజాభద్రతా చట్టం గురించి కూడా ఎటువంటి వార్తలూ లేవు. లోహండిగూడలో టాటా ఉక్కు కర్మాగారం నిర్మాణంపై జరగాల్సిన ప్రజాభిప్రాయ సేకరణ వాస్తవంగా వందలమైళ్ల దూరంలో జగదల్‌పూర్‌లోని కలెక్టర్ వారి కార్యాలయ ప్రాంగణంలో, సాయుధ దళాల పర్యవేక్షణలో, కిరాయికి తెచ్చిన 50 మంది ప్రేక్షకుల సమక్షంలో జరిగిందన్న వార్తలు కూడా లేవు. అప్పుడు వాక్ స్వాతంత్ర్యం ఏమయింది? ఏ ఒక్కరు కూడా కళింగనగర్‌ని ప్రస్తావించలేదు. భారత ప్రభుత్వానికి ఇబ్బంది కలిగించే విషయాలపై – శ్రీలంకలోని యుద్ధంలో తమిళుల ఊచకోతలో అది నిర్వహించిన రహస్యపాత్ర, లేదా ఇటీవల కాశ్మీరులో బయటపడిన అనామక సమాధులపై అధ్యయనం చేద్దామనుకుంటున్న పాత్రికేయులు, విశ్వవిద్యాలయ అధ్యయనకారులు, సినిమా దర్శకులకు వీసాలు నిరాకరించడం లేదా విమానాశ్రయాల నుంచే వెనక్కి తిప్పి పంపించటాన్ని కూడా ఎవరూ ప్రస్తావించలేదు.

కానీ మనందరమూ పాపులమే అయితే మొదటి రాయి విసిరేది ఎవరు? నేను

సాహిత్య ఉత్సవాలు: 1990ల నాటి అందాల పోటీల స్థానాన్ని సినిమా, చిత్రకళతో పాటు ఇవి ఆక్రమించాయి.

కాదు; కార్పొరేట్ సంస్థలు ప్రచురించిన నా పుస్తకాలపై వచ్చే రాయల్టీతో నేను బతికేస్తున్నాను. మనందరం టాటా స్కై ద్వారా టీవీ ఛానళ్లు చూస్తాం, టాటా ఫొటాన్ ద్వారా ఇంటర్నెట్‌లో విహరిస్తాం, టాటా టాక్సీలలో ప్రయాణిస్తాం, టాటా హోటళ్లలో బస చేస్తాం, టాటా బోన్ చైనాతో చేసిన కప్పులలో, టాటా ఉక్కుతో చేసిన చెంచాలతో తిప్పుకుంటూ టాటా వారి టీ తాగుతాం. టాటా పుస్తకాల అంగళ్లలో టాటా పుస్తకాలు కొంటాం. మనం టాటా ఉప్పు తింటాం. మనం ముట్టడిలో ఉన్నాం.

రాయి విసరటానికి గీటురాయి నైతిక స్వచ్ఛతే అయితే ఈపాటికే నోరు నొక్కెయ్యబడిన ప్రజలు మాత్రమే అర్హులుగా నిలుస్తారు. వీళ్లు వ్యవస్థ బయట ఉంటున్నారు; బహిష్కృతులుగా అడవులలో నివసిస్తున్నారు. వీళ్ల నిరసనలు ఎప్పుడూ ప్రసార సాధనాలలో చోటు చేసుకోవు. వారికున్నదంతా కొల్లగొట్టబడినప్పటికీ మంచి పౌరుల మాదిరి ట్రిబ్యునల్ నుంచి ట్రిబ్యునల్‌కి సాక్ష్యాలు చెపుతూ, వాంగ్మూలాలు ఇస్తూ ఉన్నారు.

అయితే సాహిత్య ఉత్సవం మనకి ఆహా! క్షణాలను ప్రసాదించింది. ఓప్రా వచ్చింది. ఆమె భారతదేశాన్ని ప్రేమిస్తున్నాను అంది, ఇక్కడికి మళ్లీ, మళ్లీ వస్తాను అంది. దీనికి మనమెంతో గర్వించాం.

అద్భుత కళకి ఇది ఒక అపహాస్యపు ముగింపు మాత్రమే.

కార్పొరేట్ దర్శకత్వం టాటాలకు వందేళ్లకు పైన అనుబంధం ఉంది -

దీంట్లో భాగంగా అత్యుత్తమ విద్యాలయాలను, ఆసుపత్రులను నిర్వహించారు, స్కాలర్‌షిప్పులు ఇచ్చారు. అయినప్పటికీ ఇటీవల కాలంలోనే ప్రపంచ కార్పొరేట్ పాలకవర్గపు జిగేల్‌మనే అత్యున్నత అధికార పీఠంలోకి భారతీయ కంపెనీలకు ప్రవేశం లభించింది. ప్రత్యర్థుల పట్ల ఇది మృత్యుపాశం వంటిది. కాని మామూలుగా అది ఎంత తెలివిగా వ్యవహరిస్తుందంటే దాని ఉనికే ఎవరికీ తెలియదు.

వ్యాసంలో తర్వాతి భాగం కొంత మందికి తీవ్ర విమర్శగా అనిపించవచ్చు. ఇంకోరకంగా, ప్రత్యర్థులను గౌరవించే సంప్రదాయంలో భాగంగా చూస్తే ప్రపంచాన్ని పెట్టుబడిదారీ విధానానికి అనుకూలం చెయ్యటానికి జీవితాలను అంకితం చేసిన వారి దూరదృష్టిని, సరళత్వాన్ని, సునిశితత్వాన్ని గుర్తించడంగా భావించవచ్చు.

ఉద్రూతలూగించే వారి చరిత్ర – ఇది ప్రస్తుత జ్ఞాపకాలలో కొంత మరుగున పడింది – అమెరికాలో 20వ శతాబ్ద ఆరంభకాలంలో మొదలయింది; పెద్ద మొత్తం డబ్బుతో చట్టబద్ధంగా ఫౌండేషన్లు ఏర్పడ్డాయి. పెట్టుబడిదారీ విధానానికీ (ఆ తర్వాత సామ్రాజ్యవాదానికీ) దారులు వెయ్యడంలో, వ్యవస్థల సంరక్షణకు కాపలా కాయడంలో మత ప్రబోధ కార్యక్రమాల స్థానాన్ని కార్పొరేట్ ధర్మకర్తృత్వం ఆక్రమించింది. అమెరికాలో ఏర్పడిన మొట్ట మొదటి ఫౌండేషన్లలో కార్నెజీ కార్పొరేషన్ ఒకటి; కార్నెజీ ఉక్కు కంపెనీలో వచ్చిన లాభాలతో ఇది 1911లో ఏర్పడింది. ఆ తర్వాత స్టాండర్డ్ ఆయిల్ కంపెనీ వ్యవస్థాపకుడు జె.డి. రాక్‌ఫెల్లర్ సమకూర్చిన నిధితో 1914లో రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్ ఏర్పడింది. వీళ్లు ఆ కాలపు టాటాలు, అంబానీలు.

రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్ ఆర్థిక సహాయం చేసిన, మూల విత్తం సమకూర్చిన, మద్దతిచ్చిన సంస్థలలో ఐక్యరాజ్యసమితి, సిఐఏ (అమెరికా గూఢచార సంస్థ), విదేశీ సంబంధాల మండలి (కౌన్సిల్ ఆన్ ఫారిన్ రిలేషన్స్, సిఎఫ్ఆర్), న్యూయార్క్‌లోని అద్భుతమైన ఆధునిక కళా మ్యూజియం, న్యూయార్క్‌లోనే ఉన్న రాక్‌ఫెల్లర్ కేంద్రం (ఇక్కడ డీగో రివేరా కొంటెగా కుడ్యచిత్రంలో పెట్టుబడిదారులను వనికి మాలినవాళ్లుగానూ, లెనిన్‌ని సాహసికుడిగానూ చిత్రించడంతో అంతవరకు గోడను పేల్చేసి తీసేశారు. వాక్‌స్వాతంత్ర్యానికి ఆ రోజు శలవు ప్రకటించారు) ఉన్నాయి.

జె.డి. రాక్‌ఫెల్లర్ అమెరికాలో మొదటి కోటీశ్వరుడు, ప్రపంచంలోకెల్లా అత్యంత ధనికుడు. ఆయన బానిసత్వం రద్దును కోరుకున్నాడు, అబ్రహాం లింకన్ మద్దతుదారుడు, మద్యం జోలికి పోయేవాడు కాదు. తన సంపదను తనకు దేవుడే ఇచ్చాడని నమ్మేవాడు, అది ఆయన మంచితనమేమో.

పాబ్లో నెరుడా తొలినాళ్లలో రాసిన కవితల్లో స్టాండర్డ్ ఆయిల్ కంపెనీ అన్న కవితలోని భాగమిది:

న్యూయార్క్ నుంచి వచ్చే బలిసిన దొరలు
చిరునవ్వులతో గొంతుక కోసే హంతకులు
చుట్టలు, పట్టు, నైలాన్ అన్నీ కొంటారు
చిన్న కంటకులను, నియంతలను కూడ కొనేస్తారు
దేశాలకు దేశాలను, ప్రజలను, సముద్రాలను, పోలీసులను,
స్థానిక ప్రభుత్వాలను సమస్తాన్నీ కొంటారు
పేదలు మక్కజొన్నలు నిలువచేసుకునే భాండాలను కొంటారు
పిసినారి బంగారం దాచుకున్నట్టు
ఆ పేదలను స్టాండర్డ్ ఆయిల్ లేపుతుంది
సైనికదుస్తులు తొడుగుతుంది,
అన్నదమ్ములను శత్రువులను చేస్తుంది
పెట్టుబడిదారుల యుద్ధాన్ని పరాగ్వే దేశస్తులు చేపడతారు,
దాని మెషిన్‌గన్ పట్టుకుని
బొలీవియన్లు అడవిలో కునారిల్లిపోతారు.
ఒక బొట్టు పెట్రోలు కోసం ఒక అధ్యక్షుని హత్య
పది లక్షల ఎకరాలు తాకట్టు
ఒక ఉదయం మెరుపు వేగంతో అమలయ్యే మరణశిక్ష
ప్రతిఘటించే వాళ్లకు ఒక కొత్త జైలు,
పటగోనియాలో చందమామకాంతి కింద
ఒక వెన్నుపోటు, తుపాకి గుళ్ల ప్రహారం
మంత్రులలో చిన్న మార్పులు
దేశ రాజధానిలో గుసగుసలు
ఒక చమురు అల,
మబ్బులపైన ప్రకాశించే స్టాండర్డ్ ఆయిల్ అక్షరాలు
మంత్రించినట్లు ప్రత్యక్షమవుతాయి
సముద్రం పైనా, మీ ఇళ్లలోనూ
వలసలన్నిటా ఆ వెలుగే

కార్పొరేట్లు సమకూర్చిన నిధులతో అమెరికాలో ఫౌండేషన్లు ఏర్పడుతున్న తొలినాళ్ళలో వాటి పూర్వాపరాలు, చట్టబద్ధత, జవాబుదారీతనం లేకపోవడం వంటి వాటిపై తీవ్ర చర్చలు జరిగాయి. కంపెనీల దగ్గర అంత మిగులు ధనం ఉంటే వాళ్ల శ్రామికులకు వేతనాలు పెంచవచ్చు కదా అని ప్రజలు సలహాలు ఇచ్చారు (ఇటువంటి

ఇబ్బందికరమైన సలహాలను ఆ రోజుల్లో అమెరికన్లు కూడా ఇచ్చేవారు). ఈ ఫౌండేషన్లు ఇప్పుడు సహజమైనవిగా భావింపబడుతుండవచ్చు. కానీ ఆ రోజుల్లో ఒక గొప్ప ముందు చూపు, వ్యాపార దూరదృష్టి, చట్టబద్ధమైన ఈ సంస్థలకు పన్ను చెల్లించనవసరం లేని అపార నిధులు ఉన్నాయి. ఏమీ వెల్లడి చెయ్యకుండా, ఎవరికీ జవాబుదారీ కాకుండా ఏ పనైనా చేపట్టవచ్చు. ఆర్థిక సంపదని రాజకీయ, సామాజిక, సాంస్కృతిక పెట్టుబడిగా; డబ్బుని అధికారంగా మార్చుకోటానికి ఇంతకంటే మంచి మార్గం మరొకటి ఏముంది? తమ లాభాల్లో శత సహస్రాంశం మాత్రమే ఉపయోగించి ప్రపంచాన్ని శాసించటానికి జలగలకు మెరుగైన మార్గం ఇంకేముంది? కాకపోతే కంప్యూటర్ల గురించి ఒకటి రెండు విషయాలు మాత్రమే తెలుసునని స్వయంగా పేర్కొన్న బిల్ గేట్స్ ఒక్క అమెరికా ప్రభుత్వానికే కాక ప్రపంచ వ్యాప్తంగా అన్ని ప్రభుత్వాలకు విద్య, ఆరోగ్యం, వ్యవసాయంపై విధాన నిర్ణయాలు ఎలా రూపొందించగలడు?

కాలం గడుస్తున్న కొద్దీ ఫౌండేషన్లు చేసే నిజమైన మంచి పనులను (ప్రజా గ్రంథాలయాలను నడపడం, రోగాలను నిర్మూలించడం) ప్రజలు గుర్తించడంతో ఈ ఫౌండేషన్లకు, వాటికి నిధులు సమకూర్చే కార్పొరేషన్లకు మధ్య సంబంధం మసకబార సాగింది. చివరికి అది పూర్తిగా తెరమరుగైపోయింది. ప్రస్తుతం వామ పక్షం అని చెప్పుకునే వాళ్లు కూడా వాటి నుంచి డబ్బు తీసుకోటానికి సిగ్గుపడడం లేదు.

1920ల నాటికి ముడి సరుకుల కోసం, మార్కెట్ల కోసం అమెరికా పెట్టుబడిదారీ విధానం ఇతర దేశాలపై దృష్టి సాగించసాగింది. ప్రపంచ కార్పొరేట్ పాలన అన్న భావనను ఫౌండేషన్లు రూపొందించసాగాయి. 1924లో రాక్‌ఫెల్లర్, కార్నెజీ ఫౌండేషన్లు కలిసి విదేశీ సంబంధాల మండలిని (సిఎఫ్ఆర్) ఏర్పాటు చేశాయి. వివిధ దేశాల విదేశాంగ విధానాలపై ఒత్తిడి తెచ్చే అత్యంత ప్రభావశీలి అయిన సంస్థ ప్రస్తుతం ఇదే. ఆ తరువాత ఫోర్డ్ ఫౌండేషన్ సైతం దీనికి నిధులు సమకూర్చసాగింది. అమెరికా ప్రభుత్వంలో విదేశాంగ మంత్రులుగా పనిచేసిన వారిలో 22 మందికి సిఎఫ్ఆర్‌లో సభ్యత్వం లభించింది. 1943లో ఐక్యరాజ్యసమితికి ప్రణాళిక రూపొందించిన స్టీరింగు కమిటీలో సిఎఫ్ఆర్ సభ్యులు అయిదుగురున్నారు. న్యూయార్క్‌లో సమితి ప్రధాన కార్యాలయం కట్టిన స్థలం జె.డి. రాక్‌ఫెల్లర్ ఇచ్చిన 85 లక్షల డాలర్ల నిధితో కొన్నదే.

1946 నుంచి ప్రపంచ బ్యాంకుకు అధ్యక్షులుగా (పేదల విముక్తి దాతలమని వీళ్లు చెప్పుకుంటారు) పని చేసిన 11 మంది కూడా సిఎఫ్ఆర్ సభ్యులే. (జార్జ్ ఉడ్స్ ఒక్కడే దీనికి మినహాయింపు. అయితే రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్‌కి ఉడ్స్ ట్రస్టీగానూ, చేస్-మన్‌హట్టన్ బ్యాంకుకి ఉపాధ్యక్షుడుగానూ పని చేశాడు.)

బ్రెట్టన్‌ఉడ్స్‌లో ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ కలిసి ప్రపంచ రిజర్వు కరెన్సీగా అమెరికన్ డాలరు ఉండాలనీ, ప్రపంచ పెట్టుబడి మారుమూలలకి చొచ్చుకుని పోవాలంటే బహిరంగ విపణిలో వ్యాపార పద్ధతులను ప్రామాణీకరించి, విశ్వవ్యాప్తంగా వాటినే అమలు చెయ్యాలనీ నిర్ణయించాయి. ఈ లక్ష్యం దిశగానే అవి సుపరిపాలన కోసం (పగ్గాలు తమ చేతిలో ఉన్నంత వరకు), చట్టబద్ధ పాలన కోసం (చట్టాలు చెయ్యడంలో తమ మాట చెల్లుబాటు అయ్యేంతవరకు), పందలాది అవినీతి వ్యతిరేక కార్యక్రమాల కోసం (అవి నెలకొల్పిన వ్యవస్థలను సరిదిద్దేడందుకు) పెద్ద మొత్తంలో నిధులను వెచ్చిస్తున్నాయి. ప్రపంచంలోకెల్లా అత్యంత రహస్యపూరితమైన, ఎవరికీ జవాబుదారీ కాని ఈ రెండు సంస్థలు పేద దేశాల ప్రభుత్వాలు పొరదర్శకంగా, జవాబుదారీతనంతో పని చెయ్యాలని పట్టుబడుతున్నాయి.

మూడవ ప్రపంచ దేశాల ఆర్థిక విధానాలను ప్రపంచ బ్యాంకు దాదాపుగా నిర్దేశించింది అని చెప్పవచ్చు. దేశం తరువాత దేశం ప్రపంచ పెట్టుబడికి తమ మార్కెటన్లు బార్లా తెరిచేలా ప్రపంచ బ్యాంకు బలవంతం చేసింది, వత్తిడి తెచ్చింది. కార్పొరేట్ ధర్మకర్తృత్వం మంచి వ్యాపార లాభాలను సమకూర్చిందనడంలో సందేహం లేదు.

కార్పొరేట్ నిధులను అందుకున్న ఫౌండేషన్లు తమ అధికారాన్ని అమలు చేస్తాయి, అమ్ముకుంటాయి, అనువైన మార్గాలలోకి ప్రసరింపచేస్తాయి. ఇవి ఉన్నత వర్గాల క్లబ్బుల వ్యవస్థ ద్వారా, మేధో మథన బృందాల ద్వారా (వీటిల్లో పలు సంస్థలలో పలువురికి సభ్యత్వం ఉంటుంది; ఒక దాని నుంచి ఒకదానికి సభ్యులు మారుతుంటారు) చదరంగం బల్లమీద తమ పావులను ఉంచుతుంటాయి. అనేక కుట్ర సిద్ధాంతాలు, ప్రత్యేకించి వామపక్ష బృందాలలో, చలామణీలో ఉన్నప్పటికీ ఈ ఏర్పాట్లలో ఎటువంటి రహస్యాలు లేవు; పైశాచికత్వం లేదు, పరోపకారత్వమూ లేదు. తమ డబ్బును బదిలీ చెయ్యటానికీ, ఉపయోగించుకోవటానికీ ముసుగు కంపెనీలను, విదేశీ బ్యాంకు ఖాతాలను కార్పొరేషన్లు ఎలా వినియోగించుకుంటాయో ఇవీ అంతే – అయితే ఇక్కడ చలామణి అయ్యేది డబ్బు కాదు అధికారం, అంతే తేడా.

సిఎఫ్ఆర్‌కి సమానమైన బహుళజాతి సంస్థ త్రైపాక్షిక సంఘం (ట్రైలేటరల్ కమిషన్). డేవిడ్ రాక్‌ఫెల్లర్, అమెరికా జాతీయ భద్రతా మాజీ సలహాదారు అయిన జిబిగ్‌నీవ్ బ్రెజెజిన్స్కీ (తాలిబాన్ ముందస్తు అవతారమైన అఫ్ఘన్ ముజాహిద్దీన్ వ్యవస్థాపక సభ్యుడు కూడా), చేస్ – మన్‌హట్టన్ బ్యాంక్, ఇతర ప్రైవేటు ప్రముఖులు కలిసి 1973లో దీన్ని ఏర్పాటు చేశారు. ఉత్తర అమెరికా, యూరప్, జపాన్‌లలోని సంపన్న వర్గాల మధ్య చిరకాల స్నేహబంధం, సహకారం ఏర్పడేలా చెయ్యటమే

దీని ఉద్దేశం. ఇప్పుడు చైనా, భారత (సిఐఐ నుంచి తరుణ్‌దాస్, ఇన్ఫోసిస్ మాజీ సిఇఓ నారాయణమూర్తి; గాడ్రెజ్ మానేజింగ్ డైరెక్టర్ జమ్‌షీద్ ఎన్. గాడ్రెజ్; టాటా సన్స్ డైరెక్టర్ జమ్షెడ్ జె. ఇరానీ, అవంతి గ్రూపు సిఇఓ గీతం థాపర్) సభ్యులతో ఇప్పుడు ఇది పంచపక్ష సంఘం అయ్యింది.

ఆస్పెన్ ఇన్‌స్టిట్యూట్ అన్నది అనేక దేశాలలో శాఖలున్న అంతర్జాతీయ క్లబ్బు. దీంట్లో స్థానిక సంపన్నులు, వ్యాపారవేత్తలు, అధికారులు, రాజకీయ నాయకులు సభ్యులు. ఆస్పెన్ ఇన్‌స్టిట్యూట్, ఇండియాకి తరుణ్‌దాస్ అధ్యక్షుడు, గీతం థాపర్ చైర్మన్. మాక్ కిన్సీ గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ (ఢిల్లీ, ముంబాయి పారిశ్రామిక కారిడార్‌ని ప్రతిపాదించిన సంస్థ)లోని సీనియర్ అధికారులు సిఎఫ్ఆర్ ట్రైలేటరల్ కమిషన్, ఆస్పెన్ ఇన్‌స్టిట్యూట్‌లలో సభ్యులు.

ఫోర్డ్ ఫౌండేషన్ (ఇదీ, రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్ ఎప్పుడూ కలిసే పనిచేస్తాయి; కానీ రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్‌ది మితవాద దృక్పథమైతే ఫోర్డ్ ఫౌండేషన్‌ది ఉదారవాద ముసుగు) 1936లో ఏర్పడింది. ఫోర్డ్ ఫౌండేషన్‌ని ఎవరూ అంతగా పట్టించుకోరు గానీ దానికి స్పష్టంగా నిర్వచించిన సిద్ధాంతం ఉంది, అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్‌తో ఎంతో సన్నిహితంగా పని చేస్తుంది. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చెయ్యడం, 'సుపరిపాలన' అన్న దాని కార్యక్రమాలు బ్రెట్టన్‌ఉడ్స్ పథకంలో భాగంగా వాణిజ్య కార్యకలాపాల ప్రామాణీకరణకు, స్వేచ్ఛా విపణి సామర్థ్యాన్ని పెంపొందించటానికి ఉద్దేశించినవే. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత అమెరికా ప్రభుత్వ ప్రధాన శత్రువు స్థానంలో ఫాసిస్టులకు బదులుగా కమ్యూనిస్టులను నిలబెట్టారు. ప్రచ్ఛన్న యుద్ధంలో తలపడటానికి కొత్త రకం సంస్థలు అవసరమయ్యాయి. ఫోర్డ్ నిధులు సమకూర్చిన ర్యాండ్ (ఆర్ఎఎన్‌డి – రీసెర్చి అండ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్) అనే సంస్థ అమెరికా సైనిక సేవల కోసం ఆయుధ పరిశోధనలను మొదలు పెట్టింది. స్వతంత్ర దేశాలలోకి చొచ్చుకుపోయి వాటిని ధ్వంసం చేయడానికి, కమ్యూనిస్టుల నిరంతర ప్రయత్నాలతో తలపడటానికి 1952లో ఫండ్ ఫర్ ది రిపబ్లిక్‌ని ర్యాండ్ ఏర్పాటు చేసింది; ఆ తరువాత ఇది సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ డెమొక్రటిక్ ఇన్‌స్టిట్యూషన్స్‌గా రూపాంతరం చెందింది. మెకార్థీ అతిపోకడలు లేకుండా తెలివిగా ప్రచ్ఛన్న యుద్ధం చెయ్యడం దీని పని. ఈ భూతద్దం నుంచి మనం ఫోర్డ్ ఫౌండేషన్ పనిని వీక్షించాలి. ఇది భారతదేశంలో లక్షలాది డాలర్లు ఖర్చుపెడుతోంది – కళాకారులకు, సినిమా దర్శకులకు, కార్యకర్తలకు నిధులు ఇస్తోంది, విశ్వవిద్యాలయ కోర్సులకు, స్కాలర్‌షిప్పులకు ఉదారంగా నిధులను సమకూరుస్తోంది.

మృత్యు కొగిలి: సూక్ష్మ రుణాలు అనేక మంది రైతుల పాలిట శాపమయ్యాయి. ఎంతో మంది ఆత్మహత్యలు చేసుకోవాల్సి వచ్చింది.

"మానవాళి భవిష్యత్తుకి లక్ష్యాలు" అని ఫోర్డ్ ఫౌండేషన్ ప్రకటించిన వాటిలో స్థానికంగా, అంతర్జాతీయంగా అట్టడుగు రాజకీయ ఉద్యమాల్లో జోక్యం చేసుకోవడం కూడా ఉంది. అమెరికాలో 1919లో పచారీకొట్టు అధిపతి అయిన ఎడ్వర్డ్ ఫెలీన్ ఆరంభించిన పరపతి సంఘ ఉద్యమానికి ఫోర్డ్ ఫౌండేషన్ కోట్లది రూపాయలను దానంగా, అప్పుగా సమకూర్చింది. కార్మికులకు అప్పు అందేట్లు చేయడం ద్వారా వినియోగదారీ సరుకులను పెద్ద ఎత్తున కొనుగోలు చేసే సమాజాన్ని ఏర్పరచవచ్చని ఫెలీన్ నమ్మాడు – ఆ కాలానికి ఇది వినూత్న ఆలోచన అనే చెప్పాలి. అయితే ఇది ఫెలీన్ వినూత్న ఆలోచనలో సగమే – జాతీయ ఆదాయం మరింత సమంగా పంపిణీ కావాలని కూడా ఫెలీన్ నమ్మాడు. ఫెలీన్ భావాలలో తమకు అనుకూలమైన సగాన్ని పెట్టుబడిదారులు ఎంచుకుని కార్మిక వర్గానికి కోట్లాది డాలర్లను 'తక్కువ వడ్డీ'కి అప్పుగా ఇచ్చారు. దాంతో అమెరికా శ్రామిక వర్గం నిరంతరం అప్పుల్లో కూరుకుపోయింది, తమ జీవనశైలికి తగినంత సంపాదన కోసం ఉరుకులాటలో పడిపోయింది.

చాలా సంవత్సరాల తరువాత ఇదే సిద్ధాంతాన్ని పేదరికంలో మగ్గుతున్న బంగ్లాదేశ్‌కు సూక్ష్మరుణాల పేరుతో గ్రామీణ బ్యాంకు ద్వారా మహ్మద్ యూనస్ తీసుకువచ్చాడు. ఆకలిపీడితులైన రైతుకూలీలపై దీని దారుణ ప్రభావాలు మనకు తెలిసినవే. భారత దేశంలో వందలాది ఆత్మహత్యలకు సూక్ష్మరుణ సంస్థలు

అన్నా బృందం: వినిపించేదెవరి గొంతుక?

కారణమయ్యాయి. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 2010లో 200 ఆత్మహత్యలు చోటు చేసుకున్నాయి.

సూక్ష్మరుణ సంస్థల ఉద్యోగస్తుల బెదిరింపులకు లొంగి బడి ఫీజుకని దాచుకున్న 150 రూపాయలు కట్టేసి ఆత్మహత్య చేసుకున్న 18 ఏళ్ల బాలిక రాసిన ఉత్తరాన్ని ఇటీవల ఒక జాతీయ దినపత్రిక ప్రచురించింది. "కష్టపడి డబ్బు సంపాదించండి. అప్పులు చెయ్యవద్దు," అని ఉత్తరంలో ఆ బాలిక రాసింది.

పేదరికం పేరుతో కూడా బాగా సొమ్ము చేసుకోవచ్చు, అంతేకాకుండా నోబెల్ బహుమతులు కూడా పొందవచ్చు.

1950 నాటికి రాక్‌ఫెల్లర్, ఫోర్డ్ ఫౌండేషన్లు అనేక స్వచ్ఛంద సంస్థలకు, అంతర్జాతీయ విద్యా సంస్థలకు నిధులు సమకూరుస్తూ అమెరికా ప్రభుత్వానికి మరొక అంగంగా పని చేయసాగాయి. ఆ కాలంలో లాటిన్ అమెరికా, ఇరాన్, ఇండోనేషియాలలో ప్రజాస్వామికంగా ఎన్నికైన ప్రభుత్వాలను పడగొట్టే పనిలో అమెరికా ఉంది. (అప్పటికి భారతదేశం అలీన దేశంగానే ఉన్నప్పటికీ సోవియట్ యూనియన్ వైపు మొగ్గు స్పష్టంగా ఉంది. ఆ కాలంలోనే ఈ రెండు ఫౌండేషన్లు భారతదేశంలో తమ కార్యకలాపాలు మొదలు పెట్టాయి.) ఇండోనేషియా విశ్వవిద్యాలయంలో అమెరికా శైలి ఆర్థిక శాస్త్ర కోర్సును ఫోర్డ్ ఫౌండేషన్ ఏర్పాటు చేసింది. ఇండోనేషియాలోని సంపన్న వర్గ విద్యార్థులు అమెరికా సైనికాధికారుల ద్వారా కౌంటర్ ఇన్‌సర్జెన్సీలో శిక్షణ పొందారు. 1965లో సిఐఏ మద్దతుతో సైనిక తిరుగుబాటు ద్వారా జనరల్

సుహార్తో అధికారానికి రావడంలో ఈ విద్యార్థులు కీలక పాత్ర పోషించారు. వేలాది కమ్యూనిస్టు తిరుగుబాటుదారులను ఊచకోత కోసి జనరల్ సుహార్తో అమెరికన్ల రుణం తీర్చుకున్నాడు. 1973లో సిఐఏ మద్దతుతో జరిగిన సైనిక తిరుగుబాటుకి సన్నాహంగా చిలీ దేశపు యువ విద్యార్థులను (వీళ్లు తరువాత చికాగో బాయిస్‌గా పేరుపొందారు) మిల్టన్ ఫ్రీడ్‌మన్ ద్వారా నయా ఉదారవాద ఆర్థిక విధానంలో శిక్షణ ఇవ్వడానికి చికాగో విశ్వవిద్యాలయానికి (దీనికి జె.డి. రాక్‌ఫెల్లర్ నిధులు సమకూర్చారు) తీసుకెళ్తారు. ఆ సైనిక తిరుగుబాటులో సాల్వడార్ అయెండీని చంపి జనరల్ పినోషె అధికారం కట్టబెట్టారు. పదిహేడు సంవత్సరాలు సాగిన పినోచెట్ భయానక పాలనలో హంతక దళాలు పేట్రేగిపోయాయి; ఎంతో మంది 'కనపడకుండా' పోయారు. (అయెండీ చేసిన నేరం ప్రజాస్వామికంగా ఎన్నికైన సోషలిస్టు ప్రభుత్వం కావడం, చిలీదేశపు గనులను జాతీయం చేయడం.)

1957లో రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్ ఆసియాలోని ప్రజానాయకులకు రామన్ మెగసేసే బహుమతిని ఏర్పాటు చేసింది. ఆగ్నేయ ఆసియాలో కమ్యూనిజానికి వ్యతిరేక పోరులో అమెరికాకి ముఖ్య భాగస్వామిగా నిలిచిన ఫిలిప్పైన్స్ అధ్యక్షుడి పేరుమీద దీనిని నెలకొల్పారు. 2000లో ఫోర్డ్ ఫౌండేషన్ రామన్ మెగసేసే పేరు మీద నవ నాయకత్వ అవార్డుని ఏర్పాటు చేసింది. మెగసేసే బహుమతి చాలా ప్రతిష్ఠాత్మకమైనదిగా భారతదేశంలోని కళాకారులు, సామాజిక కార్యకర్తలు, ప్రజల కోసం పని చేసేవాళ్లు భావిస్తారు. ఎం.ఎస్. సుబ్బలక్ష్మికి, సత్యజిత్‌రేకి అది వచ్చింది. జయప్రకాశ్ నారాయణ్‌కి వచ్చింది; భారతదేశంలో అత్యుత్తమ జర్నలిస్టు అయిన పి. సాయినాథ్‌కి వచ్చింది. అయితే ఆ బహుమతి వల్ల వీరికంటే, వీరివల్లే ఆ బహుమతికి ఖ్యాతి వచ్చింది. ఏ రకమైన కార్యకలాపాలు 'ఆమోదనీయమో', ఏవి కావో ఈ బహుమతి సూచిస్తూ ఉంటుంది.

గత సంవత్సరం అన్నా హజారే చేపట్టిన అవినీతి వ్యతిరేక ఉద్యమానికి ముగ్గురు మెగసేసే బహుమతి గ్రహీతలు నాయకత్వం వహించడం ఆసక్తికరమైన విషయం. అన్నా హజారే, అరవింద్ కేజ్రివాల్, కిరణ్ బేడి. అరవింద్ కేజ్రివాల్‌కి ఉన్న అనేక స్వచ్ఛంద సంస్థలలో ఒక దానికి ఫోర్డ్ ఫౌండేషన్ ధారాళంగా నిధులు ఇస్తుంది. కిరణ్ బేడి నడిపే స్వచ్ఛంద సంస్థకి కోకా కోలా, లేమన్ బ్రదర్స్ నిధులను ఇస్తున్నాయి.

అన్నా హజారే గాంధేయవాదినని చెప్పుకుంటాడు. కానీ అతను ప్రతిపాదిస్తున్న జన్ లోక్‌పాల్ బిల్లు గాంధేయవాదానికి వ్యతిరేకమైనది, ప్రమాదకరమైనది. రేయింబవళ్లూ సాగిన కార్పొరేట్ మీడియా ప్రచారం అతడిని ప్రజల గొంతుకగా పేర్కొంది. అమెరికాలో 'వాల్ స్ట్రీట్ ముట్టడి' ఉద్యమానికి భిన్నంగా హజారే నడుపుతున్న

ఉద్యమం ప్రైవేటీకరణ, కార్పొరేట్ శక్తి, ఆర్థిక 'సంస్కరణలకు' వ్యతిరేకంగా పల్లెత్తు మాట కూడా అనలేదు. ఇందుకు విరుద్ధంగా కార్పొరేట్ అవినీతి కుంభకోణాల (పెద్ద పెద్ద విలేఖరుల గుట్టు కూడా రట్టు అయ్యింది) నుంచి ప్రజల దృష్టిని మళ్లించి, రాజకీయ నాయకుల పట్ల ప్రజాగ్రహాన్ని సాకుగా చేసుకుని ప్రభుత్వ అధికారాలు మరింత నీరు కార్చాలని, మరిన్ని సంస్కరణలు చేపట్టాలని, ప్రైవేటీకరణను వేగవంతం చెయ్యాలని కోరుతున్నారు. (2008లో అన్నా హజారేకి విశిష్ట ప్రజాసేవకి ప్రపంచ బ్యాంకు అవార్డు లభించింది.) అవినీతి వ్యతిరేక ఉద్యమం తమ విధానానికి సరిగ్గా సరిపోయిందని వాషింగ్టన్ నుంచి ప్రపంచ బ్యాంకు ఒక ప్రకటన ఇచ్చింది.

* * *

పెట్టుబడిదారీ విధానం, దానితో పాటు అమెరికా ఆధిపత్యం తమ మంచికేనని నమ్మే అంతర్జాతీయ కార్యకర్తలను తయారు చేసి, శిక్షణనిచ్చే బాధ్యతను మంచి సామ్రాజ్యవాదుల మాదిరిగా మానవ సేవకులు తీసుకున్నారు. స్థానిక సంపన్నులు వలసవాదానికి తోడ్పడినట్లే వీళ్లు కూడా ప్రపంచ కార్పొరేట్ పాలనలో సహాయపడతారు. ఆ విధంగా ఈ రెండు ఫౌండేషన్లు విద్య, కళా రంగాలలోకి ప్రవేశించాయి. విదేశాంగ విధానం, దేశ ఆర్థిక విధానం తరువాత వీళ్లు ప్రభావితం చెయ్యాలనుకున్న మూడవ రంగం ఇది. అకడమిక్ సంస్థలపై, విద్యా బోధనపై ఇవి కోట్లాది రూపాయలు ఖర్చు చేశాయి, ఇంకా ఖర్చు చేస్తున్నాయి.

జోన్ రోలాఫ్స్ 'ఫౌండేషన్స్ అండ్ పబ్లిక్ పాలసీ – ది మాస్క్ ఆఫ్ ప్లూరలిజం' అన్న అద్భుతమైన పుస్తకం రాశారు. రాజకీయ శాస్త్రాల బోధనను ఫౌండేషన్లు ఎలా కొత్తగా మలిచాయో, 'అంతర్జాతీయ', 'ప్రాంతీయ' అధ్యయనాలను ఎలా తీర్చిదిద్దాయో ఈ పుస్తకంలో పేర్కొన్నారు. దీనివల్ల విదేశీ భాషలు, సంస్కృతుల నుంచి నిపుణులను ఎంచుకునే అవకాశం అమెరికా గూఢచర్య, భద్రతా సంస్థలకు లభించింది. అమెరికా విశ్వవిద్యాలయాలలోని విద్యార్థులతో, ఆచార్యులతో సిఐఏ, అమెరికా ప్రభుత్వం ఇంకా పని చేస్తూనే ఉన్నాయి. అందువల్ల మేధావిత్వపు నైతికతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

తాము పాలిస్తున్న ప్రజలను నియంత్రించటానికి వారి సమాచార సేకరణ ఏ పాలక శక్తులకైనా ప్రాథమిక అంశమవుతుంది. మధ్య భారతంలో యుద్ధ నేపథ్యంలో భూసేకరణ పట్ల, నూతన ఆర్థిక విధానాల పట్ల వ్యతిరేకత దేశమంతా విస్తరిస్తుండడంతో ప్రభుత్వం పెద్ద ఎత్తున బయోమెట్రిక్స్ కార్యక్రమం చేపట్టింది. ఇది ప్రత్యేక గుర్తింపు

సంఖ్య (యు.ఐ.డి. – ఆధార్). ప్రపంచంలోకెల్లా అత్యంత ఖరీదైన సమాచార సేకరణ పథకం ఇదేనేమో! ప్రజలకి శుభ్రమైన తాగునీళ్లు లేవు, మరుగుదొడ్లు లేవు, ఆహారం లేదు, డబ్బు లేదు. కానీ వాళ్లకి ఓటరు గుర్తింపు కార్డులు, ఆధార్ కార్డులు ఉంటాయి. 'పేదలకు సేవలను అందించడం' అన్న పేరుతో నడుస్తున్న ఆధార్ ప్రాజెక్టుకి ఇన్ఫోసిస్ మాజీ సిఇఓ నందన్ నీలేకని ఆధిపత్యం వహించడం, సమస్యల్లో ఉన్న ఐటి పరిశ్రమకు ఈ పథకం ద్వారా పెద్ద ఎత్తున నిధులు సమకూరడం యాదృచ్ఛికమేనా? (ఆధార్‌కి అయ్యే ఖర్చు అధమంలో లెక్కేసినా భారత ప్రభుత్వం ఒక సంవత్సరంలో విద్యపై ఖర్చు పెట్టేదానికంటే ఎక్కువ.) భారతదేశం వంటి అధిక జనాభా దేశంలో – అందులోనూ అధిక శాతం నిరక్షరాస్యులుగా, ప్రభుత్వ లెక్కల్లో లేని వారిగా మురికివాడల వాసులుగా, రోడ్ల వెంట సరుకులు అమ్మేవాళ్లుగా, ఎటువంటి భూమి రికార్డులు లేని ఆదివాసీలుగా ఉండగా – డిజిటైజ్ చెయ్యటానికి పూనుకోవడమంటే నేరస్తులుగా చెయ్యటమే. వాళ్లను చట్టేతరుల స్థాయి నుంచి చట్ట వ్యతిరేకుల స్థాయికి మార్చడమే. ఉమ్మడి వనరుల చుట్టూ కంచె వేసి సొంతం చేసుకున్నట్టు, ప్రజలందరి సమాచారంతో రాను రాను మరింత పోలీసు రాజ్యంగా మారుతున్న ప్రభుత్వం చేతిలో దీని ద్వారా మరింత అధికారాన్ని కట్టబెట్టినట్లవుతుంది. డిజిటల్ డేటాబేస్‌లు, 'అంకెలతో కూడుకున్న లక్ష్యాలు', 'ప్రగతికి మార్కుల సూచికలు' వంటి వాటితో బిల్ గేట్స్ ఆవహింపబడినట్లే నీలేకనిని కూడా గణాంకాల సేకరణ పూనింది. ప్రపంచంలో ఆకలి సమస్య వలసవాదం, అప్పులు, కార్పొరేట్లకు ఇబ్బడిముబ్బడిగా లాభాలు సమకూర్చే విధానాల వల్లనే కాక సమాచార లేమి వల్లనే ఉన్నట్లు.

కార్పొరేట్లు స్థాపించిన ఫౌండేషన్లు సామాజిక శాస్త్రాలకు, కళలకు పెద్ద ఎత్తున నిధులు సమకూరుస్తున్నాయి. "అభివృద్ధి అధ్యయనాలు", "ప్రజా అధ్యయనాలు", "సాంస్కృతిక అధ్యయనాలు", "మానవ ప్రవర్తనా శాస్త్రాలు", "మానవ హక్కులు" వంటి కోర్సులకు, విద్యార్థుల స్కాలర్‌షిప్పులకు ఇవి నిధులను సమకూరుస్తున్నాయి. అంతర్జాతీయ విద్యార్థులకు అమెరికా విశ్వవిద్యాలయాలు తలుపులు తెరవడంతో మూడవ ప్రపంచ దేశాల సంపన్నుల పిల్లలు వేల సంఖ్యలో వచ్చి చేరారు. ఫీజులు సొంతంగా చెల్లించలేని వాళ్లకి ఉపకార వేతనాలు ఇచ్చారు. భారతదేశం, పాకిస్తాన్ వంటి దేశాల్లో ఈనాడు అమెరికాలో చదివిన పిల్లలు లేని ఎగువ, మధ్య తరగతి కుటుంబం లేదు. వీరి నుంచి చక్కటి విద్యార్థులు, విద్యావేత్తలు వచ్చారు. అంతే కాదు, గ్లోబల్ కార్పొరేషన్లకు తమ దేశ ఆర్థిక తలుపులు తెరిచిన ప్రధాన మంత్రులు, ఆర్థిక మంత్రులు, ఆర్థిక శాస్త్రవేత్తలు, కార్పొరేట్ న్యాయవాదులు, బ్యాంకర్లు, అధికారులు కూడా వచ్చారు.

ప్రత్యేక స్థానం: యుఐడి ప్రాజెక్టు సిఇఓ నందన్ నీలేకని

ఫౌండేషన్-అనుకూల ఆర్థిక, రాజకీయ శాస్త్రాల విద్యార్థులకు ప్రతిఫలంగా ఫెలోషిప్పులు, పరిశోధన నిధులు, గ్రాంటులు, నిధులు, ఉద్యోగాలు లభించాయి. ఫౌండేషన్-ప్రతికూల భావాలు ఉన్నవారికి నిధులు అందకుండా చేస్తారు, అంచులకు నెట్టి వేస్తారు, పరిమితం చేసేస్తారు, కోర్సులను మధ్యలో ఆపేస్తారు. క్రమేపీ చర్చల్లో ఏకైక, సర్వవ్యాపిత, ఏకపక్ష ఆర్థిక భావజాలం చలామణీలోకి వచ్చింది. పైకి చూడడానికి మాత్రం సహనం, బహుళ సంస్కృతి అన్న నటన, తేలికగా తొలగిపోయే ముసుగులుంటాయి. ఈ భావజాలం సులభంగా జాతివివక్ష, జాతీయ దురహంకారం, స్థానికవాదం, యుద్ధకాంక్షతో రగిలే ఇస్లాం వ్యతిరేక వాదంగా మారిపోతుంది. దీని ఆధిపత్యం ఎంతగా ఉందంటే దీన్ని ఒక భావజాలంగా పరిగణించడం కూడా మానివేశారు. ఈ భావజాలమే సహజమైనదిగా, ప్రతి ఒక్కరూ అనుసరించాల్సిందిగా పరిణమించింది. దీనిని సవాలు చెయ్యడమంటే వాస్తవాన్ని సవాలు చెయ్యడమంతటి వెర్రితనంగా, అర్థం లేనిదిగా మారింది. ఇక్కడి నుంచి 'మరో ప్రత్యామ్నాయం లేదు' అనటానికి ఎంతో దూరం లేదు, చాలా తేలిక కూడా.

(వాల్‌స్ట్రీట్) 'ముట్టడి ఉద్యమం' పుణ్యమా అని ఇప్పుడిప్పుడే అమెరికా వీధులలోనూ, విశ్వవిద్యాలయాలలోనూ మరో భాష వినపడుతోంది. తీవ్ర వ్యతిరేక పరిస్థితులలో విద్యార్థులను 'వర్గ యుద్ధం', లేదా 'మీరు ధనికులైనందుకు మాకు బాధ లేదు, కానీ మా ప్రభుత్వాన్ని కొనేస్తే ఖబడ్దార్' వంటి బ్యానర్లతో చూడడం విప్లవంగానే పేర్కొనవచ్చు.

* * *

కార్పొరేట్ ధర్మకర్తృత్వం మొదలయ్యి వందేళ్లు గడిచాయి. ఇప్పుడది కోకాకోలా మాదిరి మన జీవితాల్లో భాగమై పోయింది. ప్రస్తుతం లక్షలాది స్వచ్ఛంద సంస్థలు ఉన్నాయి, వాటిల్లో అనేకం ఆర్థిక వనరుల చిక్కు దారులలో అంతిమంగా పెద్ద ఫౌండేషన్లతో ముడిపడి ఉన్నాయి. ఈ "స్వతంత్ర" స్వచ్ఛంద రంగంలో 45000 కోట్ల డాలర్ల మేరకు నిధులు, ఆస్తులు ఉన్నాయి. వీటిల్లో అతి పెద్దది బిల్ గేట్స్ ఫౌండేషన్ (2100 కోట్ల డాలర్లు), ఆ తరువాత స్థానాలలో లిల్లీ ఎండోమెంట్ (1600 కోట్ల డాలర్లు), ఫోర్డ్ ఫౌండేషన్ (1500 కోట్ల డాలర్లు) ఉన్నాయి.

వ్యవస్థాగత మార్పులను బలవంతంగా రుద్దడం; వైద్యం, విద్య, శిశుసంరక్షణ, అభివృద్ధి వంటి వాటిపై ప్రభుత్వం నిధులు వెచ్చించకుండా చెయ్యడం వంటి పనులకు ఐఎంఎఫ్ పాల్పడుతుండగా ఆ స్థానంలోకి స్వచ్ఛంద సంస్థలు ప్రవేశించసాగాయి. అన్నింటి ప్రైవేటీకరణ అన్నది అన్నింటినీ స్వచ్ఛంద సంస్థల పరం చెయ్యడం కూడా. ఉద్యోగాలూ, జీవనోపాధులూ కనుమరుగైపోతుండడంతో, వాటి నిజస్వరూపం తెలిసిన వాళ్లకి కూడా, స్వచ్ఛంద సంస్థలే ఉపాధికి ముఖ్యమైన మార్గాలుగా మారాయి. అయితే, స్వచ్ఛంద సంస్థలు అన్నీ చెడ్డవి కావు. లక్షలాది స్వచ్ఛంద సంస్థలలో కొన్ని చెప్పుకోదగిన, తీవ్ర మార్పులు తెస్తున్నాయి. అన్నింటి ముఖాలకు సల్లరంగు పులమడం వాటిని కించపరచటమే అవుతుంది. కంపెనీలో షేర్లు కొని లోపలి నుంచి దానిని నియంత్రించటానికి ప్రయత్నించినట్లే ప్రతిఘటన ఉద్యమాల్లోకి చొరబడటానికి కార్పొరేట్ల నుంచి, ఫౌండేషన్ల నుంచి నిధులు సమకూరిన స్వచ్ఛంద సంస్థలను మార్గంగా ప్రపంచ పెట్టుబడులు చేసుకుంటాయి. కేంద్రనాడీ మండలంలో మాదిరి, ప్రపంచ పెట్టుబడులు ప్రవహించే మార్గాలలో అవి నిఘా వేసి ఉంచుతాయి. తమ ఆతిథేయ దేశాల ప్రభుత్వాలకు కోపం తెప్పించకుండా జాగ్రత్త పడుతూ ఏ ఒక్కటీ తమ దృష్టి నుంచి జారిపోకుండా శ్రద్ధ వహిస్తూ అవి షాక్ అబ్సార్బర్లుగా, రిసీవర్లుగా, ట్రాన్స్‌మిటర్లుగా పనిచేస్తాయి. (తాము నిధులు చేకూర్చే సంస్థలు ఈ మేరకు రాతపూర్వక హామీ ఇవ్వాలని ఫోర్డ్ ఫౌండేషన్ కోరుతుంది.) యాదృచ్ఛికంగా (ఒకోసారి ఉద్దేశపూర్వకంగా) అనేక విషయాలు వాటి చెవినపడతాయి. వాటి నివేదికలు, వర్క్‌షాపులు, కార్యక్రమాల ద్వారా ఎంతో సమాచారం ఉత్పన్నమవుతుంది. పర్యవేక్షణ తీవ్రతరమవుతూ, ప్రభుత్వాలు మరింత నిరంకుశంగా మారుతున్న కాలంలో ఈ సమాచారమంతా వాటికి ఉపయోగపడుతుంది. ఒక ప్రాంతంలో అలజడి ఎంత ఎక్కువగా ఉంటే అక్కడ అంత ఎక్కువగా స్వచ్ఛంద సంస్థలు ఉంటాయి.

ఇదంతా ఇంత బాహాటంగా సాగుతుంటే నిజమైన ప్రజా ఉద్యమాలను (ఉదా: నర్మదా బచావో ఆందోళన, కూడంకుళం అణు రియాక్టరు వ్యతిరేక ఉద్యమం వంటి

వాటిని) దెబ్బ తియ్యటానికి ఆ ఉద్యమాలు, స్వచ్ఛంద సంస్థలు విదేశీ నిధులను పొందుతున్నాయని ప్రభుత్వమూ, కార్పొరేట్ మీడియా ఆరోపిస్తాయి. స్వచ్ఛంద సంస్థల, ప్రత్యేకించి బాగా నిధులున్న వాటి లక్ష్యం కార్పొరేట్ ప్రపంచీకరణను ప్రోత్సహించడమే కాని దానిని వ్యతిరేకించడం కాదు అని వీటికి బాగా తెలుసు. కోట్ల రూపాయల మూటలతో ఈ స్వచ్ఛంద సంస్థలు ప్రజల్లోకి వెళ్లి విప్లవకారులుగా మారే ప్రమాదమున్న వారిని వేతనంపై పనిచేసే కార్యకర్తలుగా మారుస్తాయి. కళాకారులకు, మేధావులకు, సినిమాలు తీసేవాళ్లకు నిధులు సమకూరుస్తూ ప్రభుత్వంతో తీవ్రంగా తలపడకుండా బహుళ-సంస్కృతి, జెండర్, ప్రజల అభివృద్ధి వంటి అస్తిత్వ రాజకీయాలు, మానవ హక్కుల భాషతో కూడిన చర్చల వైపుకి మెల్లగా మళ్లిస్తాయి.

న్యాయ భావన స్థానాన్ని మానవ హక్కుల పరిశ్రమ ఆక్రమించిన సిద్ధాంత విద్రోహంలో స్వచ్ఛంద సంస్థలు, ఫౌండేషన్లు కీలక పాత్ర పోషించాయి. మానవ హక్కుల పరిమిత దృష్టి విస్తృత వాస్తవాన్ని విస్మరించి అత్యాచారాల ఆధారిత విశ్లేషణకు పరిమితం అవుతుంది. ఈ దృక్పథంలో సంఘర్షణలో ఉన్న ఇరు పక్షాలను ఉదాహరణకు మావోయిస్టులు, భారత ప్రభుత్వం; ఇజ్రాయిల్ సైన్యం, హమాస్‌లను మానవ హక్కుల ఉల్లంఘనకు పాలుపడినట్లుగా గర్హించవచ్చు. ఈ చర్చలో గిరిజనుల భూమిని మైనింగ్ కార్పొరేషన్లు లాక్కోవడం, పాలస్తీనియన్ల భూమిని ఇజ్రాయెల్ ప్రభుత్వం లాక్కోవడం పాదసూచికలుగా మారి అంతగా ప్రాధాన్యతను పొందవు. మానవ హక్కులను పట్టించుకోవద్దని నేను అనడం లేదు. అవి అవసరమే. కాని మనం నివసిస్తున్న ప్రపంచంలో జరుగుతున్న తీవ్ర అన్యాయాలను చూడడానికి, అర్థం చేసుకోటానికి ఈ పదాలు సరిపోవు.

స్త్రీవాద ఉద్యమంతో ముడిపడి ఉన్న ఫౌండేషన్లకు సంబంధించి మరో సైద్ధాంతిక విద్రోహం ఉంది. భారతదేశంలోని "అధికారిక" స్త్రీవాదులు, మహిళా సంఘాలు తమకూ, 90,000 సభ్యత్వంతో తమ సమాజంలోని పితృస్వామ్యాన్నీ, దండకారణ్యంలో గనుల తవ్వకాల వల్ల నిర్వాసితులు కావటాన్నీ వ్యతిరేకిస్తున్న క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘటనకూ మధ్య ఎందుకు దూరాన్ని పాటిస్తున్నాయి? వాళ్లవే అయి, వాళ్లు పనిచేసిన భూములను వాళ్లకి లేకుండా చెయ్యడం, అక్కడి నుంచి లక్షలాది మంది మహిళలను ఖాళీ చేయించడం కూడ స్త్రీల సమస్యలేనని ఇవి ఎందుకు చూడడం లేదు?

అట్టడుగు స్థాయి సామ్రాజ్యవాద వ్యతిరేక, పెట్టుబడిదారీ వ్యతిరేక ప్రజా ఉద్యమాలతో ఉదారవాద స్త్రీవాద ఉద్యమ సంబంధాలు తెగిపోవడం ఫౌండేషన్ల కుతంత్రాలతో మొదలు కాలేదు. 1960లు, 70లలో మహిళలు ముమ్మరంగా

విప్లవభావాల వైపు మొగ్గినప్పుడు స్త్రీవాద ఉద్యమం తదనుగుణంగా మారలేకపోయింది, కలుపుకుని వెళ్లలేకపోయింది. తమ సాంప్రదాయ సమాజాలలోనే కాక వామపక్ష ఉద్యమాల ప్రగతిశీల నాయకత్వంగా చెప్పుకోబడుతున్న దాంట్లో సైతం పితృస్వామ్య భావజాలం, హింస పొడచూపడం పట్ల మహిళల అసహనం పెరగటాన్ని గుర్తించిన ఫౌండేషన్లు వెంటనే వారికి మద్దతును, నిధులను అందచేశాయి. భారతదేశం వంటి దేశంలో పట్టణ–గ్రామీణ ప్రాంతాల మధ్య కూడా విభజన ఉంది. పెట్టుబడిదారీ వ్యతిరేక, తీవ్రవాద ఉద్యమాలు అనేకం పల్లె ప్రాంతాల్లో ఉన్నాయి. ఇక్కడ మహిళల జీవితాలపై పితృస్వామ్య ఆధిపత్యం సాగుతూనే ఉంది. నక్సలైట్ ఉద్యమాల వంటి ఈ ఉద్యమాలలో చేరిన పట్టణ మహిళా కార్యకర్తలపై పాశ్చాత్య స్త్రీవాద ఉద్యమ ప్రేరణ, ప్రభావాలు ఉన్నాయి. విముక్తి వైపు వారి వ్యక్తిగత జీవిత ప్రయాణాలు మొదలయ్యాయి. వారు పనిచేస్తున్న ఉద్యమాలలో 'ప్రజలతో' మమేకమవ్వడమే వారి కర్తవ్యం అన్న పురుష నాయకత్వ ధోరణి వారికి మింగుడు పడలేదు. తమ జీవితాలలో వివక్ష, రోజువారీ అణచివేత అంతం కావడానికి "విప్లవం" కోసం వేచి ఉండే స్థితిలో అధిక శాతం మహిళా కార్యకర్తలు లేరు. తమ తోటి పురుష కామ్రేడ్ల పెత్తందారీ ధోరణులను అసలే సహించటానికి సిద్ధంగా లేరు. స్త్రీ – పురుష సమానత్వం అన్నది విప్లవానంతర వాగ్దానంగా కాక విప్లవ ప్రక్రియలో తక్షణమే, రాజీలేని సూత్రంగా, కచ్చితంగా అమలు కావాలని వాళ్లు కోరుకున్నారు. విప్లవోద్యమంతో నిరాశ, నిస్పృహలకు గురయి కోపంతో ఉన్న ఈ మహిళలు ఉద్యమానికి దూరమయి ఇతర రూపాలలో మద్దతు, సహకారం కోసం చూడసాగారు. ఫలితంగా 1980ల చివరి నాటికి భారత మార్కెట్లు తలుపులు తెరవబడుతున్న సమయంలో భారతదేశంలోని ఉదారవాద స్త్రీవాద ఉద్యమం పూర్తిగా స్వచ్ఛంద సంస్థల రూపం దాల్చింది. ఈ స్వచ్ఛంద సంస్థలలో అనేకం స్వలింగ సంపర్క హక్కులు, గృహ హింస, ఎయిడ్స్, సెక్స్ వర్కర్ల హక్కులు వంటి అంశాలపై గణనీయమైన కృషి చేశాయి. కాని నూతన ఆర్థిక విధానాల వల్ల మహిళలు ఎక్కువగా కష్టాల పాలైనప్పటికీ దానికి వ్యతిరేకంగా ఉదారవాద మహిళా ఉద్యమాలు ముందు వరసలో లేవు. నిధుల కేటాయింపుల ద్వారా ఈ ఫౌండేషన్లు "రాజకీయ" కార్యక్రమాల పరిధిని నిర్ణయించడంలో విజయం సాధించాయి. స్వచ్ఛంద సంస్థలకు నిధులు సమకూర్చేటప్పుడు విధాన సిఫారసులు ఏవి మహిళల "అంశా"లో, ఏవి కావో నిర్దేశిస్తాయి.

మహిళా ఉద్యమం స్వచ్ఛంద సంస్థల రూపం దాల్చడంతో స్త్రీవాదానికి ప్రామాణికంగా పాశ్చాత్య ఉదారవాద స్త్రీవాదం (దానికే అధికంగా నిధులు అందుతున్న

ఆనందాల గనులు; డోంగ్రియా ఖోండ్ గిరిజనులు పవిత్రంగా భావించే
ప్రతిదానినీ వేదాంత తవ్వితీరేస్తోంది

కారణంగా) నిలిచింది. ఎప్పటిలాగే స్త్రీల శరీరాల మీద యుద్ధాలు సాగాయి. బోటాక్స్[3] నుంచి బుర్ఖాల నిషేధం వరకు ఇవి విస్తరించి ఉన్నాయి. (బోటాక్స్, బుర్ఖా రెండింటితోనూ బాధింపబడుతున్న మహిళలు కూడా ఉన్నారు) ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగినట్టు మహిళలు తాము ఏం చేయాలో ఎంచుకునే అవకాశాలు కల్పించడం కాకుండా బలవంతంగా బుర్ఖా లాగెయ్యడం ఆమెను విముక్తం చెయ్యడం కాదు, నగ్నం చేయడం అవుతుంది. అది అవమానించే చర్య అవుతుంది, సాంస్కృతిక సామ్రాజ్యవాదమవుతుంది. అది బుర్ఖాకి సంబంధించింది కాదు. బలవంతం చెయ్యటానికి సంబంధించింది. ఒక మహిళను బుర్ఖా వేసుకోమని బలవంతం చెయ్యడం ఎంత తప్పో, దానిని తీసెయ్యమని బలవంతం చెయ్యడం కూడా అంతే తప్పు. సామాజిక, రాజకీయ, ఆర్థిక నేపథ్యాలతో సంబంధం లేకుండా స్త్రీవాదాన్ని ఈ విధంగా చూడటమన్నది అస్తిత్వానికి సంబంధించినదిగా మారుతుంది, దుస్తులు, అలంకరణలకు సంబంధించిన యుద్ధంగా మారుతుంది. 2001లో ఆఫ్ఘనిస్తాన్‌పై దాడికి దిగినప్పుడు ఈ వాదనతోనే అమెరికా ప్రభుత్వం పాశ్చాత్య స్త్రీవాద బృందాల మద్దతు పొందింది. తాలిబన్‌ల కింద ఆఫ్ఘన్ మహిళలు అనేక కష్టాలకు గురయ్యారు (ఇంకా గురవుతున్నారు) అన్నది నిజమే. కానీ వాళ్ల మీద బాంబులు వెయ్యడం వల్ల వాళ్ల సమస్యలు పరిష్కారం కావు.

---

3. బోటాక్స్ – ఒక రకమైన న్యూరోటాక్సిన్. ముఖంలో ముడతలు తగ్గటానికి సౌందర్య సాధనంగా వాడుతున్నారు. దీనిని వాడుతున్న వ్యక్తిపై అనేక ఇతర దుష్ప్రభావాలు ఉండవచ్చు.

రంగు, రూపం, స్వభావం లేని తమదైన ఒక భాషను స్వచ్ఛంద సంస్థల ప్రపంచం రూపొందించుకుంది. ప్రతిదీ భిన్నమైన, ప్రత్యేక ఆసక్తి గల, వృత్తిపర "విషయం" అవుతుంది. ప్రజల అభివృద్ధి, నాయకత్వ అభివృద్ధి, మానవ హక్కులు, ఆరోగ్యం, విద్య, పునరుత్పత్తి హక్కులు, ఎయిడ్స్, ఎయిడ్స్ బాధిత అనాథలు – ప్రతిదీ మరొక దానితో సంబంధం లేకుండా దేనికది వేర్వేరు పాత్రలలో పాతరవేయబడ్డాయి. నిధులు ఇచ్చేటప్పుడు ప్రతి దానికి ప్రత్యేక, వివరణాత్మక విధానాన్ని అందచేస్తారు. సంఘీభావాన్ని అణచివేత ద్వారా విచ్ఛిన్నం చెయ్యలేకపోయారు, కానీ నిధులు సమకూర్చే విధానం ద్వారా తేలికగా సాధించారు. స్త్రీవాదం లాగానే పేదరికాన్ని కూడా తరచు అస్తిత్వ సమస్యగా చిత్రీకరిస్తారు. దోపిడీ, అన్యాయాలవల్ల ఏర్పడిన వాళ్లుగా కాక మనుగడలో ఉన్న ఒక ప్రత్యేక తెగగా పేదలు చూడబడతారు. సమస్యల పరిష్కారం (స్వచ్ఛంద సంస్థల ద్వారా ప్రతి వ్యక్తికీ వేరువేరుగా అందచేయబడుతుంది) ద్వారా తాత్కాలిక సత్వర విముక్తి, సుపరిపాలన ద్వారా దీర్ఘకాల విముక్తి లభిస్తుంది. ప్రపంచ కార్పొరేట్ పెట్టుబడిదారీ పాలనలోనే ఇది సాధ్యమవుతుందని వేరే చెప్పనవసరం లేదు.

* * *

భారతదేశం "వెలిగిపోయిన" కొంత కాలంలో పేదరికం గుర్తింపు లేకుండా ఉండిపోయింది. ఆ తరువాత స్లమ్‌డాగ్ మిలియనీర్ వంటి సినిమాలు దారి చూపగా కళల్లో ఒక ప్రత్యేక గుర్తింపుతో పేదరికం తిరిగి తెర మీదకి వచ్చింది. పేదలు, వాళ్ల స్ఫూర్తి, కష్టాలను ఎదుర్కొనే వారి పటిమలకు సంబంధించిన ఈ కథలలో కొంత ఉద్రిక్తత, స్థానిక రంగు పులమటానికి చిన్న చిన్న ప్రతినాయకులు తప్పించి వేరే దుష్టశక్తులు ఉండవు. ఈ కథల రచయితలు పాతకాలం నాటి మానవ అధ్యయన శాస్త్రవేత్తల వంటివాళ్లు. తెలియని ప్రదేశాలలోకి ధైర్యంగా జొరబడి, "క్షేత్రస్థాయి"లో పని చేస్తున్నందుకు వాళ్లకి పొగడ్తలు, బహుమతులు లభిస్తాయి. ధనికులను ఈ విధంగా శల్యపరీక్ష చెయ్యడం అరుదుగా తప్పించి జరగదు. ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు, ఎన్నికలు, కోర్టులు, ప్రసార సాధనాలు, ఉదారవాద అభిప్రాయాలను ఎలా నిర్వహించాలో తెలుసుకున్న తరువాత నయా-ఉదారవాద పాలకుల ముందు ఒక సవాలు మిగిలి ఉంది. ప్రజలలో పెరుగుతున్న అశాంతిని, నిజమైన "ప్రజల అధికారాన్ని" ఎదుర్కోవడం ఎలా? దానిని ఎలా మచ్చిక చెయ్యాలి? నిరసనలను పెంపుడు జంతువులుగా ఎలా మార్చాలి? ప్రజల ఆగ్రహాన్ని దారులు లేని చీకటి మార్గాలలోకి ఎలా మళ్లించాలి?

ఇక్కడ కూడా ఫౌండేషన్లకు, వాటి అనుబంధ సంస్థలకు సుదీర్ఘ, ఘనచరిత్ర ఉంది. 1960లలో అమెరికాలో నల్లజాతి పౌరహక్కుల ఉద్యమాన్ని తీవ్రవాద రహితంగా, ప్రమాద రహితంగా మార్చటాన్ని, 'బ్లాక్ పవర్'ని 'బ్లాక్ క్యాపిటలిజం'గా విజయవంతంగా మార్చటాన్ని ఉదాహరణలుగా పేర్కొనవచ్చు.

జె.డి. రాక్‌ఫెల్లర్ ఆదర్శాలకు అనుగుణంగా రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్ మార్టిన్ లూథర్ కింగ్ సీనియర్ (మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ తండ్రి)తో పని చేసింది. అయితే విద్యార్థి అహింసా సమన్వయ సంఘం (ఎస్ఎన్‌సిసి), బ్లాక్ పాంథర్స్ వంటి మిలిటెంట్ సంస్థలు ఏర్పడిన క్రమంలో లూథర్ కింగ్ సీనియర్ ప్రభావం కనుమరుగు అవుతూ వచ్చింది. ఫోర్డ్, రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్లు రంగ ప్రవేశం చేశాయి. "మధ్యేవాద" నల్లజాతి సంఘాలకు 1970లలో అవి 1.5 కోట్ల డాలర్ల నిధులు సమకూర్చాయి. ఇందులో భాగంగా వ్యక్తులకు నిధులు, ఫెలోషిప్పులు, స్కాలర్‌షిప్పులు, చదువు మధ్యలో వదిలేసిన వారికి ఉపాధి సంబంధ శిక్షణ, నల్లజాతి వారి వ్యాపారాలకు మూలధనం వంటివి ఇచ్చాయి. అణచివేత, అంతర్గత కుమ్ములాటలు, నిధుల ఉచ్చులో పడి తీవ్రవాద నల్లజాతి సంఘాలు క్రమేపీ కృశించి, భ్రష్టుపట్టి పోయాయి.

పెట్టుబడిదారీ విధానం, సామ్రాజ్యవాదం, జాతి దురహంకారం, వియత్నాం యుద్ధాల మధ్య సంబంధాలను గుర్తించి మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ నిషిద్ధ ప్రాంతంలోకి అడుగుపెట్టాడు. ఫలితంగా, అతడు హత్య చెయ్యబడ్డాడు. తరువాత అతని జ్ఞాపకాలు సైతం శాంతి భద్రతలకు ముప్పుగా పరిగణింపబడ్డాయి. అతడి వారసత్వాన్ని మార్కెట్ అనుకూల రూపంలోకి తిరిగి రాయటానికి ఫౌండేషన్లు, కార్పొరేషన్లు ఎంతగానో శ్రమించాయి. 20 లక్షల డాలర్ల గ్రాంటుతో మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ పేరుతో అహింసాత్మక సామాజిక మార్పు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీనికి నిధులు సమకూర్చిన వాళ్లలో కొందరు: ఫోర్డ్ మోటారు కంపెనీ, జనరల్ మోటార్స్, మొబిల్, వెస్టర్న్ ఎలక్ట్రిక్, ప్రాక్టర్ అండ్ గాంబల్, యుఎస్ స్టీల్, మోన్‌సాంటో. కింగ్ గ్రంథాలయాన్ని, పౌరహక్కుల ఉద్యమానికి సంబంధించి పురావస్తువులను ఈ కేంద్రం నిర్వహిస్తోంది. ఈ కేంద్రం నిర్వహించే అనేక కార్యక్రమాలలో "అమెరికా రక్షణ శాఖ, సాయుధ దళాల చాప్‌లేన్సీ బోర్డు, తదితరులు" సన్నిహితంగా పనిచేస్తున్నారు. "స్వేచ్ఛా వాణిజ్య విధానం: అహింసాత్మక సామాజిక మార్పుకి మార్గం" అన్న అంశంతో మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ పేరు మీద ఉపన్యాసాలను అది నిర్వహిస్తుంది. శుభమస్తు.

దక్షిణ ఆఫ్రికాలోని జాతి దురహంకార వ్యతిరేక ఉద్యమంలో కూడ అమెరికా ఇటువంటి కుట్రకే పాల్పడింది. దక్షిణ ఆఫ్రికా పట్ల అమెరికా విధానంపై 1978లో

నల్ల జాతి 'విముక్తి': లేక వాషింగ్టన్ ఏకాభిప్రాయానికి తల ఒగ్గటమా?

రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్ ఒక అధ్యయనాన్ని చేపట్టింది. ఆఫ్రికా జాతీయ కాంగ్రెస్ (ఎఎన్‌సి) పై పెరుగుతున్న సోవియట్ యూనియన్ ప్రభావం గురించి ఈ నివేదిక హెచ్చరిస్తూ అన్ని జాతుల వాళ్లు రాజకీయ అధికారాన్ని నిజంగా పంచుకున్నప్పుడే అమెరికా వ్యూహాత్మక, కార్పొరేట్ ప్రయోజనాలు (అంటే దక్షిణ ఆఫ్రికా ఖనిజాలు అందుబాటులో ఉండడం) కాపాడబడతాయని అది పేర్కొంది.

ఎఎన్‌సికి ఫౌండేషన్లు మద్దతు ఇవ్వడం మొదలు పెట్టాయి. స్టీవ్ బికో నాయకత్వంలోని బ్లాక్ కాన్షియస్‌నెస్ వంటి అతివాద సంఘాలపై ఎఎన్‌సి దాడులు చేసి వాటి ఉనికి కూడా మిగలకుండా చేసింది. దక్షిణ ఆఫ్రికాకి నెల్సన్ మండేలా మొదటి నల్లజాతి అధ్యక్షుడిగా అధికారం చేపట్టినప్పుడు అతడిని నేలమీద నడిచే దేవదూత అంటూ కొనియాడారు. స్వాతంత్ర్య యోధుడిగా 27 ఏళ్లు జైలులో గడిపినందుకు మాత్రమే అతడికి ఈ గౌరవం దక్కలేదు, వాషింగ్టన్ ఏకాభిప్రాయానికి అతడు పూర్తిగా తల ఒగ్గాడు కాబట్టే అతడికి ఈ గౌరవం దక్కింది. ఎఎన్‌సి కార్యక్రమాల నుంచి సోషలిజం తెరమరుగైపోయింది. దక్షిణ ఆఫ్రికా "శాంతియుత పరిణామాని"కి

ఎంతగానో పొగడ్తలు, ప్రశంసలు లభించాయి. అంటే దాని అర్థం భూ సంస్కరణలు లేవు, నష్ట పరిహారాలు లేవు, దక్షిణ ఆఫ్రికా గనుల జాతీయకరణ లేదు. వీటికి బదులు ప్రైవేటీకరణ, వ్యవస్థాగత మార్పులు ఉన్నాయి. దక్షిణ ఆఫ్రికా అత్యున్నత పౌర బహుమానమైన 'ఆర్డర్ ఆఫ్ గుడ్ హోప్'ని మండేలా తన పాత మిత్రుడు, మద్దతుదారు అయిన జనరల్ సుహార్తోకి ఇచ్చాడు. ఆయన ఇండోనేషియాలో కమ్యూనిస్టులను ఊచకోత కోశాడు. ఈనాడు దక్షిణాఫ్రికాలో మెర్సిడిస్ కార్లు నడిపే మాజీ ఉద్యమకారుల, ట్రేడ్ యూనియన్ నాయకుల బృందం పాలన సాగిస్తోంది. నల్లజాతి విముక్తి అన్న భ్రాంతి కొనసాగించడానికి ఇంత మాత్రం సరిపోతుంది.

అమెరికాలో 'బ్లాక్ పవర్' ఉవ్వెత్తున లేవడంతో భారతదేశంలో ప్రగతిశీల, అతివాద దళిత ఉద్యమానికి ప్రేరణ లభించింది. బ్లాక్ పాంథర్స్ మిలిటెంట్ రాజకీయాలను అనుకరిస్తూ దళిత పాంథర్స్ వంటి సంస్థలు ఏర్పడ్డాయి. పూర్తిగా అదే విధంగా కాకపోయినా దళిత శక్తి కూడా ముక్కలుగా చేయబడి, ప్రమాదరహితంగా మార్చబడింది. మితవాద హిందూ సంస్థలు, ఫోర్డ్ ఫౌండేషన్ సహకారంతో దళిత పెట్టుబడిదారీ విధానంగా మారే పరిణామ క్రమంలో ఉంది.

'కులాన్ని వ్యాపారంతో కూలగొట్టవచ్చని నిరూపించటానికి దళిత కంపెనీలు సిద్ధంగా ఉన్నాయి' అన్న వార్తను ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గత డిసెంబరులో ప్రచురించింది. భారతదేశ దళిత వాణిజ్య పరిశ్రమల సమాఖ్య (డిఐసిసిఐ) ప్రోత్సాహకులలో ఒకరు "దళిత సమావేశానికి ప్రధానమంత్రిని ఆహ్వానించడం మన దేశంలో అంత కష్టం కాదు. కానీ దళిత పారిశ్రామికవేత్తలకు టాటా, గాద్రెజ్‌తో టీ తాగుతూ, భోజనం చేస్తూ ఫొటోలు దిగటమనేది ఒక కల. అది నిజం కావడం వాళ్ల విజయాన్ని సూచిస్తుంది," అన్నారు. ఆధునిక భారతదేశ పరిస్థితి నేపథ్యంలో ఉన్నత స్థాయిలలో దళిత పారిశ్రామికవేత్తలకు అవకాశం ఉండకూడదనడం కులతత్వాన్ని, తిరోగమన భావజాలాన్ని సూచిస్తుంది. అయితే దళిత రాజకీయాల ఆశలు, సైద్ధాంతిక చట్రం అంత మాత్రమే అయితే అంతకంటే విషాదకరమైన అంశం మరొకటి ఉండదు. మానవ మలాన్ని ఇప్పటికీ తమ నెత్తి మీద మోసే పది లక్షల మంది దళితులకు ఇది ఏ రకంగానూ సహాయ పడదు.

ఫోర్డ్ ఫౌండేషన్ నుంచి నిధులు తీసుకునే యువ దళిత విద్యార్థులను తీవ్రంగా విమర్శించడానికి లేదు. భారతీయ కుల వ్యవస్థ అనే బురద కూపం నుండి బయటపడడానికి ఇంకెవరు అవకాశం ఇస్తున్నారు? ఘటనలు ఈ మలుపు తీసుకోవటానికి నిందను ఇప్పటికీ ప్రధానంగా పై కులాల నాయకత్వంలో ఉన్న భారత కమ్యూనిస్టు ఉద్యమం తీసుకోవాలి, అందుకు సిగ్గుపడాలి. మార్క్స్ వర్గ

విశ్లేషణలోకి కులాన్ని బలవంతంగా కూర్చోబెట్టటానికి అది ఎన్నో ఏళ్లుగా ప్రయత్నిస్తూనే ఉంది. సిద్ధాంతంలోనూ, ఆచరణలోనూ అది ఘోరంగా విఫలమయింది. దళిత ప్రజానీకానికీ, వామపక్షాలకు మధ్య అగాధం దార్శనికుడైన దళిత నాయకుడు డా॥ భీంరావ్ అంబేద్కర్‌కీ, ట్రేడ్ యూనియన్ నాయకుడు, భారత కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపకుడూ అయిన ఎస్.ఏ. డాంగేకీ మధ్య అభిప్రాయ భేదాలతో మొదలయ్యింది. 1928లో ముంబాయిలో వస్త్రపరిశ్రమలో సమ్మె సమయంలో డా॥ అంబేద్కర్‌కి కమ్యూనిస్టు పార్టీపై ఉన్న భ్రమలు తొలగిపోయాయి. శ్రామిక వర్గ ఐక్యత అని ఎంత పెద్దగా అరిచినప్పటికీ కార్ఖానాలోని నేత విభాగంలోకి "అంటరానివాళ్ల"ను రానివ్వకుండా చెయ్యడం (దానికంటే తక్కువయిన నూలు వడికే విభాగానికి పరిమితం చెయ్యడం) కమ్యూనిస్టు పార్టీకి అభ్యంతరకరంగా కనిపించలేదు. (నేత పనిలో భాగంగా ఉమ్ముతో దారాన్ని అతికే పని ఉంటుంది. కాబట్టి, దళితులు ఈ పని చేస్తే అంటు అవుతుందని మిగిలిన కులాలు అభ్యంతరం పెట్టాయి.)

హిందూ పురాణాలు అంటరానితనాన్ని, అసమానత్వాన్ని పాదుకుపోయేలా చేసిన నేపథ్యంలో అంటరానివాళ్ల సామాజిక, పౌరహక్కుల కోసం, ఎప్పుడో రాబోయే కమ్యూనిస్టు విప్లవం కోసం వేచి ఉంటే సరిపోదని, తక్షణమే వాటికోసం పోరాడం చెయ్యాలని అంబేద్కర్ గుర్తించాడు. అంబేద్కర్‌వాదులకు, వామపక్షాలకు మధ్య అగాధం వల్ల ఇరువర్గాలూ ఎంతో నష్టపోయాయి. భారత శ్రామికవర్గంలో ప్రధానమైన దళిత ప్రజానీకం తమ విముక్తికి, ఆత్మాభిమానానికి ఆశలను రాజ్యాంగం, పెట్టుబడిదారీ విధానం, బిఎస్‌పి వంటి రాజకీయ పార్టీల చుట్టు అల్లుకున్నాయి (బిఎస్‌పి అనుసరించే అస్తిత్వ రాజకీయాలు ముఖ్యమైనవే కాని, దీర్ఘకాలంలో అవి ప్రయోజనకరంగా ఉండవు).

అమెరికాలో కార్పొరేట్ నిధులు సమకూర్చిన ఫౌండేషన్లతో స్వచ్ఛంద సంస్థల సంస్కృతి ఏర్పడింది. భారతదేశంలో నూతన ఆర్థిక విధానాలు రూపొందుతున్న 1990లలో ఉద్దేశపూర్వక కార్పొరేట్ ధర్మకర్తృత్వం మొదలయింది. అత్యున్నత అధికార పీఠంలో సభ్యత్వం అంత చౌకగా దొరకదు. హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌కి 5 కోట్ల డాలర్లను, కార్నెల్ విశ్వవిద్యాలయానికి మరో 5 కోట్ల డాలర్లను టాటా గ్రూప్ దానం చేసింది. యేల్‌లో 'ఇండియా ఇనిషియేటివ్' కోసం స్థాపక మూలధనానికి ఇన్ఫోసిస్‌కి చెందిన నందన్ నీలేకని, అతని భార్య రోహిణి 50 లక్షల డాలర్లు దానం చేశారు. మహీంద్రా గ్రూపుకి చెందిన ఆనంద్ మహీంద్రా హార్వర్డ్ హ్యూమానిటీస్ కేంద్రానికి కోటి డాలర్లు (ఇంత మొత్తం ఎవ్వరూ ఇవ్వలేదు) ఇవ్వడంతో దాని పేరు మహీంద్రా హ్యూమానిటీస్ కేంద్రంగా మారింది.

మన దేశానికి వస్తే గనులు, లోహాలు, విద్యుత్తులో ప్రధానంగా ఉన్న జిందాల్ గ్రూపు జిందాల్ గ్లోబల్ లా స్కూల్ నిర్వహిస్తోంది; త్వరలోనే జిందాల్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్ అండ్ పబ్లిక్ పాలసీని ప్రారంభించబోతోంది. (కాంగోలో ఫోర్డ్ ఫౌండేషన్ ఒక లా కళాశాల నడుపుతోంది.) ఇన్ఫోసిస్‌లోని లాభాలతో నందన్ నీలేకని నిధులు సమకూర్చిన న్యూ ఇండియా ఫౌండేషన్ సామాజిక శాస్త్రవేత్తలకు బహుమానాలు, ఫెలోషిప్పులు ఇస్తోంది. జిందాల్ అల్యూమినియం నిధులు సమకూర్చిన సీతారాం జిందాల్ ఫౌండేషన్ గ్రామీణాభివృద్ధి, పేదరిక నిర్మూలన, పర్యావరణ విద్య, నైతిక ఉత్థానం వంటి రంగాలలో పని చేస్తున్న వారికి ఒక్కొక్కటి కోటి రూపాయలతో అయిదు నగదు బహుమానాలను ప్రకటించింది. రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్ మూసలోనే అబ్జర్వర్ రీసర్చ్ ఫౌండేషన్ (ఓఆర్ఎఫ్)కు రిలయన్స్ బృందానికి చెందిన ముఖేష్ అంబానీ నిధులు సమకూర్చాడు. దీని సలహాదారులుగా, పరిశోధక 'ఫెలో'లుగా పదవీ విరమణ చేసిన ఇంటెలిజెన్స్ ఏజెంట్లు, వ్యూహాత్మక విశ్లేషకులు, రాజకీయ నాయకులు (పార్లమెంటులో వీళ్లు ఒకరిపై మరొకరు కత్తులు దూస్తున్నట్లు కనపడతారు), పాత్రికేయులు, విధాన రూపకర్తలు ఉన్నారు.

ఓఆర్ఎఫ్ ఉద్దేశాలు ముక్కుసూటిగానే ఉన్నాయి: "ఆర్థిక సంస్కరణలకు అనుకూలంగా ఏకాభిప్రాయాన్ని సాధించడం". అంతేకాకుండా ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసి, మలచడం; "వెనకబడిన జిల్లాలలో ఉపాధి కల్పన నుండి అణు, జీవ, రసాయనిక ముప్పులను ఎదుర్కోడానికి సమకాలీన వ్యూహాల వైవిధ్య అంశాలలో ప్రత్యామ్నాయ, ఆచరణీయ విధానాలను" రూపొందించడం.

ఓఆర్ఎఫ్ లిఖిత ఉద్దేశాలలో "అణు, జీవ, రసాయనిక యుద్ధాలు" పేర్కొనబడడం నాకు మొదట్లో అంతుపట్టలేదు. దాని పొడవైన 'వ్యవస్థాగత భాగస్వాముల' జాబితాలో ప్రపంచంలో అతిపెద్ద ఆయుధ తయారీదారులైన రేథియాన్, లాక్‌హీడ్ మార్టిన్‌ల పేర్లు కనపడడంతో నా గందరగోళం తగ్గింది. తన దృష్టిని భారతదేశం వైపు మళ్లిస్తున్నట్లు 2007లో లాక్‌హీడ్ ప్రకటించింది. భారతదేశ 3200 కోట్ల డాలర్ల రక్షణ వ్యయంలో కొంతైనా రేథియన్, లాక్‌హీడ్ మార్టిన్ కంపెనీలు తయారు చేసిన ఆయుధాలు, లక్షిత క్షిపణులు, విమానాలు, యుద్ధనౌకలు, పర్యవేక్షణ పరికరాల కోసం కేటాయింపబడవా?

యుద్ధాల కోసం ఆయుధాలు కావాలా? లేక ఆయుధ వ్యాపారం కోసం యుద్ధాలను సృష్టించాలా? యూరపు, అమెరికా, ఇజ్రాయిల్ ఆర్థిక స్థితి ప్రధానంగా వాటి ఆయుధ పరిశ్రమలపైనే ఆధారపడి ఉంది. చైనాకి బదలాయించని ఉత్పత్తి రంగాలలో ఇది కూడా ఒకటి.

అమెరికా–రష్యాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధంలో అమెరికా తరపున పాకిస్తాన్ పోషించిన పాత్రను అమెరికా–చైనాల మధ్య కొత్త ప్రచ్ఛన్న యుద్ధంలో భారతదేశం పోషించాలని ఆశిస్తున్నారు. పాకిస్తాన్‌కి ఏ గతి పట్టిందో మనకి తెలుసు. ఇండియా–చైనాల మధ్య ఘర్షణలను గోరంతలను కొండంతలు చేసి చూపిస్తున్న పత్రికా వ్యాఖ్యాతలకు, "వ్యూహాత్మక విశ్లేషకులకు" ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఇండో–అమెరికన్ ఫౌండేషన్లతోటి, మేధో బృందాలతోటి సంబంధాలున్నాయని వెల్లడవుతోంది. అమెరికాకి "వ్యూహాత్మక భాగస్వామి"గా ఉండటమంటే దేశాధినేతల మధ్య స్నేహపూర్వక టెలిఫోను సంభాషణలు ఉంటాయని కాదు. దాని అర్థం ప్రతి స్థాయిలోను సహకారం (జోక్యం) ఉండడం. దీంట్లో భాగంగా భారత భూభాగంలో అమెరికా ప్రత్యేక దళాలను నెలకొల్పుతారు. (ఈ విషయాన్ని ఇటీవల పెంటగన్ కమాండర్ బిబిసితో మాట్లాడుతూ ధృవీకరించారు.) అంతేకాకుండా ఇంటెలిజెన్స్ సమాచారాన్ని పంచుకుంటారు, మన వ్యవసాయ, ఇంధన విధానాలను మారుస్తారు, ప్రపంచ పెట్టుబడులకు మన వైద్య, విద్య రంగాలను తెరుస్తారు. మన రిటేల్ మార్కెటును విదేశాలకు తెరుస్తారు. ఇది ఒక అసమాన భాగస్వామ్యంలో, ఎలుగుబంటి పట్టులో భారతదేశం చిక్కి బలవంతంగా నాట్యం చేయించబడడం; అందుకు తిరస్కరించిన మరుక్షణం భారతదేశం బుగ్గి చేయబడుతుంది.

ఓఆర్ఎఫ్ 'వ్యవస్థాగత భాగస్వాముల' జాబితాలో 'ర్యాండ్ కార్పొరేషన్', ఫోర్డ్ ఫౌండేషన్, ప్రపంచ బ్యాంకు, బ్రూకింగ్స్ ఇన్‌స్టిట్యూషన్ (దీని ప్రకటిత లక్ష్యం అమెరికన్ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చెయ్యడం; అమెరికన్ల ఆర్థిక, సామాజిక సంక్షేమాన్ని, భద్రతని, అవకాశాలను పెంపొందించడం; మరింత స్వేచ్ఛా వాణిజ్య, సురక్షిత, సంపన్న, సహకార అంతర్జాతీయ వ్యవస్థను నిర్మించడం అన్న మూడింటికీ సృజనాత్మక, ఆచరణీయ సిఫారసులు అందచేయడం) ఉన్నాయి. ఇదే జాబితాలో జర్మనీకి చెందిన రోజా లక్సెంబర్గ్ ఫౌండేషన్ కూడా ఉంది. (పాపం రోజా! కమ్యూనిజం కోసం ప్రాణం అర్పించిన ఆమె పేరు చివరికి ఇటువంటి జాబితాలో చోటు చేసుకుంది!)

పెట్టుబడిదారీ విధానం పోటీ మీద ఆధారపడి ఉంటుంది. కానీ అందరికంటే సైనున్నవాళ్ల సంఘీభావం, అందరినీ కలుపుకునే గుణం ప్రదర్శించగలరు. ఫాసిస్టులు, సోషలిస్టులు, నియంతలు, సైనిక పాలకులతో పాశ్చాత్య పెట్టుబడిదారులు కలిసి పనిచేశారు. వాళ్లు అన్ని పరిస్థితులకు అనువుగా మారగలరు, నిరంతరం కొత్తదారులు కనుక్కోగలరు. వేగంగా ఆలోచించగలగడం, వ్యూహాత్మక ఎత్తుగడలు పన్నే తెలివి వాళ్ల సొంతం.

అయితే, ఆర్థిక సంస్కరణలు విజయవంతంగా అమలు చెయ్యగలిగినప్పటికీ; యుద్ధాలు చేసి, దేశాలను సైనిక ఆక్రమణకు గురిచేసి స్వేచ్ఛా వాణిజ్య "ప్రజాస్వామ్యాలను" నెలకొల్పినప్పటికీ దాని పూర్ణ రూపం ఇంకా వెల్లడికాని సంక్షోభాన్ని పెట్టుబడిదారీ విధానం ఎదుర్కొంటోంది. "అన్నిటికీ మించి తమని కాటికి పంపించేవాళ్లను బూర్జువా వర్గం ఉత్పత్తి చేస్తుంది. దాని పతనమూ, శ్రామిక వర్గ విజయమూ రెండు అనివార్యమైనవి" అని మార్క్స్ చెప్పాడు.

శ్రామిక వర్గం నిరంతరం దాడికి గురవుతుందని మార్క్స్ చెప్పాడు. కర్మాగారాలు మూతపడుతున్నాయి, ఉద్యోగాలు కనుమరుగవుతున్నాయి, కార్మిక సంఘాలను రద్దు చేస్తున్నారు. ఈ కాలమంతటిలో సాధ్యమైనన్ని విధాలుగా కార్మికులకు మధ్య వైరుధ్యాలు సృష్టించారు. భారతదేశంలో హిందూ-ముస్లిం, హిందూ-క్రిస్టియన్, దళిత్-ఆదివాసీ, ఒక కులం-మరొక కులం, ఒక ప్రాంతం-మరొక ప్రాంతం అన్న రూపాలలో శ్రామికుల మధ్య చిచ్చుపెట్టారు. అయినప్పటికీ, ప్రపంచ వ్యాప్తంగా శ్రామికవర్గం పోరాడుతూనే ఉంది, తిరగబడుతూనే ఉంది. చైనాలో లెక్కలేనన్ని సమ్మెలు, తిరుగుబాట్లు జరుగుతూనే ఉన్నాయి. భారతదేశంలో అత్యంత సంపన్నమైన కార్పొరేషన్ల పథకాలను అత్యంత పేద ప్రజలు మధ్యలోనే నిలవరించారు.

పెట్టుబడిదారీ విధానం సంక్షోభంలో ఉంది. అభివృద్ధి ఫలాలు కిందికి బొట్లు బొట్లుగా జారే విధానం విఫలమయింది. సంపద పైకి ఎగదన్నే విధానమూ ఇప్పుడు చిక్కుల్లో పడుతోంది. అంతర్జాతీయ ఆర్థిక పతనం కమ్ముకొస్తోంది. భారత దేశ ప్రగతి 6.9 శాతానికి పడిపోయింది. విదేశీ పెట్టుబడులు వెనక్కి మళ్లుతున్నాయి. పెద్ద పెద్ద అంతర్జాతీయ కార్పొరేషన్లు అంతులేని ధనరాశుల మీద కూర్చుని ఉన్నాయి – వాటిని ఎక్కడ పెట్టుబడిగా పెట్టాలో, ఆర్థిక సంక్షోభం ఏ రూపం తీసుకుంటుందో వాళ్లకి తెలియడం లేదు. ప్రపంచ పెట్టుబడి అనే విధ్వంసక, యంత్రభూతంలో ఒక పెద్ద, వ్యవస్థాగత బీట ఏర్పడింది.

పెట్టుబడిదారీ విధానానికి గొయ్యి తవ్వేది అంతిమంగా సిద్ధాంతాన్ని విశ్వాసంగా మార్చిన దాని మత గురువులే కావచ్చు. వ్యూహాత్మక తెలివితేటలు ఎంతగా ఉన్నా ఒక చిన్న వాస్తవాన్ని వాళ్లు గ్రహించలేకపోతున్నారు. పెట్టుబడిదారీ విధానం ఈ పుడమిని నాశనం చేస్తోంది. గతంలో సంక్షోభాలను ఎదుర్కోవటానికి ఉపయోగపడ్డ రెండు చిట్కాలు – యుద్ధమూ, మార్కెటూ ఇక ఏ మాత్రం పనిచెయ్యవు.

అంటిల్లా బయట నిలబడి సూర్యాస్తమయాన్ని చాలాసేపు చూశాను. ఆ భవనం ఎంత ఎత్తు ఉందో అంతే లోతుకి ఉన్నట్టు ఊహించుకున్నాను. ఇరవై ఏడు అంతస్తుల మూల వేరు భూమి లోతుల్లోకి చొరబడుతూ, దాని సారాన్నంతటినీ పీల్చివేస్తూ

పొగగా, బంగారంగా మారుస్తోంది.

అంబానీలు తమ భవనానికి అంటిల్లా అన్న పేరు ఎందుకు ఎంచుకున్నారు? 8వ శతాబ్దపు ఐబీరియన్ గాథ ప్రకారం అంటిల్లా అన్నది ఒక దీవుల సమూహం పేరు. హిస్పానియా దేశాన్ని ముస్లింలు జయించినప్పుడు ఆరుగురు క్రిస్టియన్ విసిగోథిక్ బిషప్పులు, వారి అనుచరులు ఓడలెక్కి పారిపోయారు. సముద్రం మీద కొన్ని రోజులపాటు, బహుశా కొన్ని వారాల పాటు ప్రయాణం చేసి అంటిల్లా దీవులను చేరుకున్నారు. అక్కడ ఒక కొత్త నాగరికతను నిర్మించాలని వాళ్లు నిర్ణయించుకున్నారు. బర్బరీకుల స్వాధీనంలో ఉన్న తమ మాతృభూమితో శాశ్వతంగా సంబంధాలు తెంచేసుకోటానికి తాము వచ్చిన ఓడలను వాళ్లు తగలబెట్టేశారు.

తమ బహుళ అంతస్తుల భవనానికి అంటిల్లా అని పేరు పెట్టడం ద్వారా అంబానీలు పేదరికం, మురికివాడలతో నిండిన తమ మాతృభూమితో తెగతెంపులు చేసుకుని ఒక కొత్త నాగరికతను నిర్మించాలనుకుంటున్నారా? భారతదేశంలో అత్యంత విజయవంతమైన విభజన – మధ్య, ఎగువ తరగతులు అంతరిక్షంలోకి విడిపోయే– ఉద్యమంలో ఇది చరమాంకమా?

ముంబయిని చీకట్లు కమ్ముకుంటూ ఉండగా ఎత్తైన అంటిల్లా గేట్ల ముందుకి గంజిపెట్టిన చొక్కాలతో, వాకీటాకీలతో గార్డులు వచ్చారు. బహుశా దెయ్యాలను పారదోలటానికేమో కళ్లు మిరుమిట్లుగొలిపే లైట్లు వెలిగాయి. అంటిల్లా కాంతివంతమైన లైట్లు తమకు రేయిని లేకుండా చేస్తున్నాయి అని ఇరుగుపొరుగు వాళ్లు ఫిర్యాదు చేస్తున్నారు.

మన రేయిని మనం తిరిగి స్వాధీనం చేసుకోటానికి సమయం ఆసన్నమైనట్లు ఉంది.

* * *